# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :210 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 28-10-2025 | పేజీలు:4 వెల: 2.00

## డంకీ రూట్‌లో ప్రవేశం.. 54 మంది భారతీయులను బహిష్కరించిన అమెరికా

అమెరికాలో వలసలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం కఠినచర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ వలసలు ఆగడం లేదు. డంకీ మార్గం లో తమ దేశంలోకి ప్రవేశించారనే ఆరోపణలతో 54 మంది భారతీయులను అమెరికా తాజాగా వెనక్కిపంపింది. అందులో అత్యధికంగా హర్యాణా వాసులే కావడం గమనార్హం. 16 మంది కర్నాల్ యువకులు కాగా, 15 మంది కైతాల్‌కు చెందిన వారు. అంబాలా (5), యమునా నగర్ (4), కురుక్షేత్ర (4), జింద్ (3), సోనిపట్ (2), పంచకుల, పానిపట్, రోహ్తక్, ఫతేహాబాద్ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. వారంతా ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నట్లు పోలీసులు తెలిపారు. బహిష్కరణకు గురైన వారు 25 నుంచి 40 ఏళ్ల మధ్య ఉన్నవారే నని చెప్పారు. వారందరినీ కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు వెల్లడించారు. వీరంతా అక్రమమార్గమైన డంకీ రూట్ ద్వారా అమెరికాలోకి ప్రవేశించినట్లు కర్నాల్ డీఎస్పీ సందీప్ కుమార్ తెలిపారు. కాగా, ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత అక్రమ వలసలపై ఉక్కుపాదం

## జూబ్లీహిల్స్ గెలిస్తేనే.. రేవంత్ రెడ్డి జాతకం ఏం చెబుతోంది?



హైదరాబాద్,వచ్చేనెల 11న జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తెలంగాణలో అధికార పార్టీకి సవాల్ గా మారింది. రెండేళ్ల క్రితం అనూహ్యంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి తాజా ఉప ఎన్నిక రిఫరెండంగానే చెబుతున్నారు. నిజానికి కాంగ్రెస్ పార్టీ సిటింగు సీటు కాకపోయినప్పటికీ, అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నిక కావడంతో ప్రభుత్వ పనితీరుకు ఇది పరీక్షగానే చెబుతున్నారు. ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠకు ఈ ఎన్నిక ఒక అగ్ని పరీక్షగా వ్యాఖ్యానిస్తున్నారు. 2023 నవంబరు 30న తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత ఆరు నెలలకు పార్లమెంటు ఎన్నికల జరిగితే అధికార కాంగ్రెస్ 8 పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకుని గౌరవం దక్కించుకుంది. ఇక మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు జరగాల్సివున్నా, రకరకాల కారణాలతో ఇప్పటివరకు వాయిదాల మీద వాయిదాలు పడుతూనే ఉన్నాయి. ఇలాంటి సమయంలో అనూహ్యంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రావడం, నేరుగా ప్రజల తీర్పు ఇవ్వనుండటం వల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరుకు పరీక్షగానే భావిస్తున్నారు. 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో ప్రధానంగా హైదరాబాదులో ఆక్రమణల తొలగింపునకు ఆయన ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన వ్యవస్థ హైడ్రా. దీనిపై రకరకాల విమర్శలు, ప్రశంసలు వినిపిస్తున్నాయి. అయితే ప్రజలు ఏమనుకుంటున్నారనేది ఇంతవరకు స్పష్టం కాలేదు. అదేవిధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపైనా మిశ్రమ స్పందనే ఉంది. ఇక రేషన్ కార్డుల పంపిణీ, గృహ నిర్మాణాలు ఇలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై ఇప్పటివరకు ప్రజాభిప్రాయం ఏంటో తెలుసుకునే అవకాశం లేకుండాపోయింది. వీటిన్నటికీ జూబ్లీహిల్స్ ఎన్నిక ఒక జవాబు చెబుతుందా? అనే ఉత్కంఠ కొనసాగుతోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీలో పరిస్థితులు ఏమంత ఆశాజనకంగా లేవనే టాక్ వినిపిస్తుంది. చాలాకాలం తర్వాత కాంగ్రెస్ సంస్కృతిని చూస్తున్న ప్రజలు రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల తీరుపై అసంతృప్తిగా ఉన్నారని కూడా అంటున్నారు. మంత్రులు కూడా బహిరంగంగా కీచులాడుకోవడం విమర్శలకు కారణమవుతోంది. ఈ పరిస్థితులలో ప్రజాభిప్రాయం ఎలా ఉందనేది ఆసక్తిరేపుతోంది. కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు ప్రజలను ప్రభావితం చేస్తున్నాయా? లేదా? అన్న చర్చ నడుమ జరగనున్న ఈ ఎన్నిక ఒక స్పష్టతనిచ్చే అవకాశం ఉందంటున్నారు. అంతేకాకుండా జూబ్లీహిల్స్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిమతం మేరకు అభ్యర్థి ఎంపిక జరిగింది. దీంతో వ్యక్తిగతంగా కూడా ఇక్కడ గెలుపు సీఎం రేవంత్ ప్రతిష్టకు పరీక్షగానే చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో జూబ్లీహిల్స్ లో గెలిస్తే రేవంత్ రెడ్డి నాయకత్వంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పుకోవచ్చునని అంటున్నారు. అంతేకాకుండా ఇన్నాళ్లు కీచులాటలకు దిగుతున్న మంత్రులు, ఇతర నేతలు కూడా సైలెంటు అవ్వాల్సిన అవసరం ఉంటుందని అంటున్నారు. మరోవైపు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు కూడా ప్రజామోదం లభించినట్లు అవుతుందని అంటున్నారు. ముఖ్యంగా హైడ్రా మరింత దూకుడుగా పనిచేసే అవకాశం ఉంటుందని అంటున్నారు. లేనిపక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలన్నీ పునఃసమీక్షించుకోవాల్సి వుంటుందని అంటున్నారు. దీంతో జూబ్లీహిల్స్ ఎన్నిక సీఎం రేవంత్ రెడ్డి జాతకాన్ని మార్చేదిగా వ్యాఖ్యానిస్తున్నారు.

## ఆటో డ్రైవర్లు అంటే ఎందుకు అంత చిన్న చూపు



హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల పరిస్థితి పూర్తి అధ్వానంగా తయారైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా ఆటో కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ రేవంత్ రెడ్డి అమలు చేయలేదని మండిపడ్డారు. ఆటో కార్మికులకు బాకీ పడిన రూ.24 వేలు ఎంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే హామీని నెరవేరుస్తారని చెప్పారు. కోకాపేటలోని తన నివాసం నుంచి ఎర్రగడ్డకు, అక్కడి నుంచి తెలంగాణ భవన్ వరకు హరీశ్ రావు ఆటోలో ప్రయాణించారు. అనంతరం మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఆందోళనలో ఉన్నారు. రైతులు, చిరు ఉద్యోగులు, మహిళలు, ఆటో డ్రైవర్లు కావచ్చు.. అందరూ ఆవేదనలో ఉన్నారు. ఆటో డ్రైవర్ల పరిస్థితి మరీ ఆందోళనకరంగా ఉంది. పేరుకి ఉచిత బస్సు అన్నారు, మహిళలకు ఫ్రీ అన్నారు. మొగోళ్ళకి డబల్ టికెట్ కొడుతున్నారు. టికెట్ రేట్లు పెంచి కుటుంబం మీద భారం వేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదుసార్లు బస్ చార్జీలు పెంచింది. రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో హైదరాబాద్‌కి వచ్చి సినిమా నటులకంటే ఎక్కువ యాక్టింగ్ చేశారు. చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో మెట్ల మీద కూర్చొని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మొదటి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశారు. నిరుద్యోగులను వాడుకొని ఓట్లు, డబ్బులు తీసుకొని.. నిరుద్యోగ యువతీ యువకులను వదిలేశారు. నాడు రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చి ఇదే యూసఫ్‌గూడా జూబ్లీహిల్స్‌లో ఆటో ఎక్కి ఆటో కార్మికులకు అరచేతిలో వైకుంఠం చూపించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.12 వేలు ఇస్తామని చెప్పారు. ఆటోనగర్, ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఆటోనగర్ అసలే లేదు. ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచుతామని పత్తా లేదు. ఇస్తామన్న రూ.12 వేలకి దిక్కు లేదు. రాష్ట్రంలో ఉన్న 5 నుంచి 6 లక్షల ఆటోలకు కాంగ్రెస్ పార్టీ ఒక్కొక్క ఆటోకు రూ.24 వేలు బాకీ పడింది. ఆ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు వాటాల కోసం తన్నుకుంటున్నారు. వాటికోసం పైసలు ఉన్నాయి. కానీ ఆటో కార్మికులకు నెలకు రూ.1000 ఇవ్వడానికి లేవా?. రేవంత్ రెడ్డి నెల నెల మూటలు మోస్తూ ఢిల్లీకి కప్పం కడుతున్నాడు. ఆటో డ్రైవర్లు అంటే ఎందుకు అంత చిన్న చూపు. లక్ష కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తున్నాం, లక్ష కోట్లతో ఫోర్త్ సిటీ నిర్మిస్తానంటున్నావు. కానీ ఆటో డ్రైవర్లకు నెలకు రూ.1000 ఇవ్వలేవా రేవంత్ రెడ్డి?. రాహుల్ గాంధీ.. ఓట్ల కోసం ఆటో ఎక్కి తిరిగావు. ఇప్పుడు ఆటో కార్మికుల కష్టాలు పట్టవా?. మరోసారి రాహుల్ గాంధీ హైదరాబాద్ వస్తే శంషాబాద్‌లో ఆటోలతో నిరసన తెలుపుతాం. రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆటో కార్మికుల బాధ తెలవాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆటోల నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. వెంటనే బాకీ పడ్డ రూ.24 వేలు ప్రతి ఆటో డ్రైవర్‌కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. మొత్తం ఆటో కార్మికులకు రెండేండ్ల బాకీ చెల్లించినా రూ.1500 కోట్లు అవుతుంది. రూ.3 లక్షలు ఫీజు పెంచితే మద్యం టెండర్లపై రూ.3 వేల కోట్లు ప్రభుత్వానికి వచ్చాయి. అందులో నుంచి రూ.1500 కోట్లు ఆటో కార్మికులకు ఇచ్చి వారిని కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటివరకు 161 మంది ఆటో కార్మికులు చనిపోయారు. ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. చనిపోయిన ఆటో డ్రైవర్ కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలి. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికికాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తాం. ఆటో కార్మికులు ఎవరూ చనిపోవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. తప్పకుండా మిమ్మల్ని కాపాడుకుంటాం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆటో కార్మికులు ఎక్కడ ఉన్నా కాంగ్రెస్‌ని ఓడించేలా పనిచేయండి. ప్రతి ఆటో అన్న రెండు ఫోన్లు చేసి మీ బంధుమిత్రులకు జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కి ఓటు వేయాలని చెప్పండి. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓడిపోతే కనీసం రేవంత్ రెడ్డికి బుద్ధి వస్తుంది. ఆటో కార్మికులకు ఇస్తానన్న హామీలు నెరవేరుస్తాడు. రేవంత్ రెడ్డి గురువు ఆంధ్రప్రదేశ్‌లో ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తున్నారు. రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లందరికీ బీఆర్ఎస్ పార్టీ మద్దతుగా ఉంది. అసెంబ్లీలో ఆటో డ్రైవర్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి అసెంబ్లీని స్తంభింపజేస్తాం. కేసీఆర్ మళ్ళీ వస్తారు. ఆటో డ్రైవర్ల కష్టాలు తీరుస్తారు.' అని హరీశ్ రావు అన్నారు.

## కవితతో కేసీఆర్ పార్టీ పెట్టిస్తున్నాడా? అసలు నిజం ఇదీ

హైదరాబాద్,భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నుంచి సస్పెండైన తర్వాత కల్వకుంట్ల కవిత రాజకీయ ప్రస్థానం మళ్లీ చురుకు గా మారింది. ఈ పరిణామం తెలంగాణ రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు, సమీకరణాలకు దారితీస్తోంది. ఇప్పటివరకు పార్టీ ఏర్పాటుపై కేవలం ఊహాగానాలు మాత్రమే ఉన్నా, ఆమె తాజా కార్యకలాపాలు, వ్యాఖ్యలు దీనికి బలం చేకూరుస్తున్నాయి.

'జనం బాట'తో ప్రజల్లోకి కవిత

కవిత ప్రస్తుతం "జనం బాట" పేరుతో ప్రజల్లోకి చురుగ్గా వెళ్లుతున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆమె తన అత్తవారిల్లైన నిజామాబాద్ నుంచి ప్రారంభించారు. ఈ పర్యటనల ద్వారా ఆమె కేవలం ప్రజా సమస్యలపైనే కాకుండా, బీఆర్ఎస్‌లోని అంతర్గత వ్యవహారాలపై కూడా బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

బీఆర్ఎస్‌పై అసంతృప్తి

తన ఓటమికి పార్టీ లోపల నుంచే ప్రయత్నాలు జరిగాయని, పార్టీలోనే తనకు ఇబ్బందులు కల్పించారని కవిత స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. ఆమె మాటల్లో గులాబీ పార్టీ నేతలపై ఉన్న అసంతృప్తి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పేర్లు ప్రస్తావించకపోయినా, ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో అంతర్గతంగా ఉన్న విభేదాలను వెల్లడిస్తున్నాయి.

పార్టీ ఏర్పాటుపై కవిత సంచలన వ్యాఖ్యలు

రాజకీయ పార్టీ ఏర్పాటు గురించి కవిత చేసిన తాజా వ్యాఖ్యలు ఈ మొత్తం చర్చకు కేంద్ర బిందువుగా మారాయి. ఆమె మాట్లాడుతూ "నాతో పార్టీ పెట్టించడానికి కేసీఆర్ గారు బయటకు పంపించారని అంటున్నారు. కానీ అది నిజం కాదు. కేసీఆర్ గారికి అలాంటి అవసరం లేదు. నాకు ఆధారాలు



ఉన్నప్పుడే మాట్లాడుతాను. అవసరమైతే రాజకీయ పార్టీని కచ్చితంగా పెడతాను. కాంగ్రెస్ ఇప్పుడు మునిగిపోతున్న నావలాంటిది, ఆ పార్టీ మద్దతు అవసరం లేదు."ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ఒక కొత్త శక్తి ఆవిర్భవించేందుకు మార్గం సుగమం చేస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఆమె 'జాగృతి' పేరిటే పార్టీని ప్రారంభిస్తారా లేక కొత్త పేరుతో ముందుకు వస్తారా అనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మొత్తానికి, కల్వకుంట్ల కవిత అడుగులు ఇప్పుడు తెలంగాణ రాజకీయ వాతావరణాన్ని మళ్లీ వేడెక్కిస్తున్నాయి. ఆమె కొత్త పార్టీ ఎప్పుడు, ఏ రూపంలో వస్తుందనేది వేచి చూడాలి. కానీ, ఆమె రాజకీయ ప్రస్థానం ప్రతి ప్రధాన పార్టీకీ ఆలోచనలో పడేలా చేస్తోందా? ఏపీలో షర్మిలలా వీగిపోతుందా? అన్నది వేచిచూడాలి.. కవిత తీసుకునే తదుపరి నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారనుంది.

## రెండేండ్లలో 100 మందికిపైగా గురుకుల విద్యార్థులు మృతి..



హైదరాబాద్: మూడు రోజుల క్రితం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వర్షిత (15) ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌స్పందించారు. వర్షిత ఆత్మహత్య చేసుకోవడం హృదయ విదారకమన్నారు. ఆమె కుటుంబానికి తీవ్ర సంతాపం తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో గురుకులాలు ఎంతో వృద్ధి సాధించాయని చెప్పారు. కానీ కాంగ్రెస్ పాలనలో గురుకుల పాఠశాలల స్థాయి దిగజారిందని విమర్శించారు. రెండేండ్లలో 100 మందికిపైగా గురుకుల విద్యార్థులు మరణించారన్నారు. విద్యార్థుల మరణాలపై కాంగ్రెస్ సర్కార్ కనీసం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి బాధ్యతలేదంటూ మండిపడ్డారు. సానుభూతి, జవాబుదారీతనం అసలే లేవని దుయ్యబట్టారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన మమత, తిరుపతి దంపతుల కూతురు శ్రీవర్షిత (15) వంగరలోని పీవీ రంగారావు తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్నది. దీపావళి సెలవులకు వెళ్లిన శ్రీ వర్షిత ఈ నెల 23న తిరిగి పాఠశాలకు వచ్చింది. గత శుక్రవారం ఉదయం (ఈ నెల 24) పాఠశాల సిబ్బంది సెల్‌ఫోన్ నుంచి ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసింది. ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ వేధిస్తున్నారని, తనను వెంటనే తీసుకెళ్లాలని, ఇక్కడ ఉండలేనని మొరపెట్టుకున్నది. దీంతో తల్లిదండ్రులు తీసుకెళ్లేందుకు పాఠశాలకు వస్తున్నట్టు బదులిచ్చారు. ప్రార్థనా సమయం కావడంతో విద్యార్థులంతా బయటకు రాగా, శ్రీవర్షిత కనిపించలేదు. దీంతో డార్మెటరీ హాల్‌కు వెళ్లి చూడగా చున్నీతో ఉరేసుకొని విగత జీవిలా కనిపించింది. కాగా, వర్షిత మృతదేహాన్ని కూడా అంబులెన్సులో కాకుండా ట్రాక్టర్లో తరలించడం తోటి విద్యార్థినులతోపాటు అందరినీ కలచివేసింది. విద్యార్థినులు రోదిస్తున్న వీడియోను కేటీఆర్ పోస్టు చేశారు.

## 3 నెలల్లో రేవంత్ సర్కార్ కూలిపోతుంది: మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్



హైదరాబాద్,మూడు నెలల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూలిపోబోతుందని రాష్ట్రీయ లోక్ దళ్( రాష్ట్ర అధ్యక్షులు.. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన చేపట్టిన సామాజిక తెలంగాణ సాధన రథయాత్ర నల్గొండకు చేరుకున్న సందర్భంగా మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నల్లగొండ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. మంత్రల నుంచే ముప్పు ఉందన్నారు. మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ప్రభుత్వం తక్కువగా అంచనా వేస్తుందన్నారు. ఆయన చాలా మంచివారు నిజాయితీపరుడని తాను ఆయనతోనే కలిసి కాంగ్రెస్ లో చేరడం జరిగిందని గుర్తు చేశారు. పార్టీలో చేరికల సందర్భంగా రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చిన ఆ పార్టీ నాయకత్వం మాట తప్పిందన్నారు. రాజగోపాల్ రెడ్డి కి 30నుంచి 40మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారని ఆయన రాబోయే మూడు నెలల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చివేస్తారని దిలీప్ కుమార్ జోస్యం చెప్పారు. ఎలాగూ ఖజానాలో డబ్బులు లేవని రేవంత్ రెడ్డి చెప్తున్నందున ప్రభుత్వం కూలిపోయినా నష్టం లేదని ఆయన ఇంట్లో కూర్చోవడం బెటర్ అన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించినా ఒరిగేది ఏమీ లేదన్నారు. బలిదానాలతో తెచ్చుకున్న తెలంగాణలో సామాజిక తెలంగాణ కల సాకారం అవుతుందని భావించామని, కానీ కేసీఆర్ కుటుంబం పాలనలో తెలంగాణ దోపిడికి గురైందన్నారు. అన్ని రంగాలను స ర్వనాశనం చేశారని దుయ్యబుట్టారు. వా ళ్లను దించి కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే వీళ్లు అదే దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 90శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం దక్కాలంటే వారందరు ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రైవేటు పరిశ్రమలలో స్థానికులకే 95 శాతం ఉద్యోగాలు ఇచ్చే విదంగా చట్టం తేవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 28లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, వారికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇప్పించి సొంత పరిశ్రమలు, వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేవిధంగా ప్రభుత్వం ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు.

### డిజిటల్ అరెస్ట్‌లపై సుప్రీం ఆందోళన

న్యూఢిల్లీ, డిజిటల్ అరెస్టులపై సిబిఐ దర్యాప్తుల జరగాల్సి ఉందన్న అభిప్రాయాన్ని సుప్రీం పేర్కొంది. వరుసగా జరుగుతోన్న సైబర్ నేరాల కారణంగా పలువురు ఆర్థికంగా దోపిడీకి గురవుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ కేసుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఇటీవల వచ్చిన ఓ కేసును సుమోటాగా తీసుకొని విచారణ జరుపుతోంది ఈ నేరాలపై సీబీఐ దర్యాప్తును పర్యవేక్షిస్తానని పేర్కొంది. డిజిటల్ అరెస్టు కారణంగా తాను రూ.కోటి కోల్పోయానని హరియాణాకు చెందిన ఓ వృద్ధ మహిళ వేసిన కేసు నేపథ్యంలో ఈ విచారణ జరుగుతోంది. ఈ సందర్భంగా సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. మయన్మార్, థాయ్‌లాండ్ వంటి ఆఫ్‌షోర్ లొకేషన్ల నుంచి ఇలాంటి కేసులు వెలుగు చూస్తున్నాయని, ఈ కేసుల దర్యాప్తునకు ఒక ప్రణాళికను రూపొందించాలని సీబీఐను ఆదేశించింది. కేంద్ర ఏజెన్సీ దర్యాప్తులో పురోగతిని పరిశీలిస్తామని,

## నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నార్కోటిక్ బృందం దాడులు..

నిజామాబాద్, అక్టోబర్ 27 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం నార్కోటిక్ బృందం దాడులు నిర్వహించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కృత్రిమ (కల్తీ) కల్లు తయారీకి వినియోగించే మత్తు పదార్థాలు కలిగియున్న సమాచారం మేరకు నార్కోటిక్ ఇన్స్పెక్టర్ పూర్ణేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ తో పాటు మోపాల్ మండల పరిధిలో దాడులు నిర్వహించారు. వినాయక నగర్ ప్రాంతంలో నివాసం ఉండే ప్రవీణ్ గౌడ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా మోపాల్ లో గల తమ కల్లు డిపో కు వెళ్తుండగా మార్గమధ్యంలో నార్కోటిక్ బృందం అతన్ని పట్టుకొని తనిఖీ చేశారు. అతడి సమాచారం మేరకు వినాయక నగర్ ప్రాంతంలో ఉండే సాగర్ గౌడ్ అనే మరో వ్యక్తి ఇంట్లో సైతం నార్కోటిక్ టీం తనిఖీలు నిర్వహించారు. అనంతరం మోపాల్ మండల పరిధిలో గల కల్లు డిపో వద్ద రూ.5 లక్షల విలువ చేసే సుమారు 500 గ్రా.ల అల్ప్రోజ్ జోలం (మత్తు పదార్థం)ను సీజ్ చేశారు. అనంతరం పట్టుబడిన ఇద్దరిని తదుపరి విచారణ చేసి, కేసు నమోదు చేసేందుకు మోపాల్ ఎస్సైకి అప్పగించినట్లు సమాచారం.

జిల్లా కేంద్రంలో మార్కోటిక్ బృందం వరుస దాడులు

నిజామాబాద్ మండల పరిధిలో గత 40 రోజుల వ్యవధిలో ఆల్కోటిక్ బృందం కల్తీ కల్లుకు వినియోగించే మత్తుపదార్థాలను పట్టుకునేందుకు రెండుసార్లు దాడులు నిర్వహించారు. గత 40 రోజుల క్రితం సెప్టెంబర్ 16న నిజామాబాద్ మండల పరిధిలోని గుండారం ప్రాంతంలో ఓ డిపో పై దాడి చేసి డిపో నిర్వాకుడు రమేష్ గౌడును అదుపులోకి తీసుకొని అక్కడ నుండి 600 గ్రా.ల అల్ప్రోజ్ జోలంను పట్టుకొని ఇద్దరు నిందితులను రూరల్ పోలీస్ స్టేషన్లో అప్పగించిన



విషయం తెలిసింది. మళ్లీ ఈ రోజు నిజామాబాద్ మండల పరిధిలో నార్కోటిక్ టీమ్ మరో దాడి చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకొని ఆల్ఫా జోలం సీజ్ చేయడంతో చర్చనియాంశంగా మారింది.

### కాంగ్రెస్ ప్రభుత్వంలో రోడ్లన్నీ అస్తవ్యస్తం

భద్రాచలం, అక్టోబర్ 27 : కాంగ్రెస్ ప్రభుత్వంలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని, ప్రధాన రహదారులను తక్షణమే బాగు చేయాలని బీఆర్ఎస్ భద్రాచలం మండల కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ శ్రేణులతో కలిసి స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రోడ్లన్నీ ధ్వంసమైనట్లు తెలిపారు. నియోజవర్గంలో ఇసుక దోపిడీతో రోడ్లన్నీ పాడైపోయి ప్రజలు నరకయాతన అనుభవిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు.

## సంపాదకీయం

మంగళవారం 28-10-2025

# మహా గట్‌బంధన్ సవాల్

బీహార్ శాసనసభ ఎన్నికలను ఎదుర్కొంటున్న ఇండియా బ్లాక్ (మహా గట్‌బంధన్) తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్‌ను ఏకాభిప్రాయంతో ప్రకటించి అధికార జెడియు నేతృత్వంలోని ఎన్‌డిఎకి తిరుగులేని సవాల్ విసిరింది. అంతేకాదు, ఎన్నికలకు ముందుగానే తమ ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా వికాశ్ శీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) అధ్యక్షుడైన ముఖేష్ సహాని పేరును సైతం ప్రకటించి ఎన్నికల సమరానికి సై అంది. ఇండియా బ్లాక్ తీసుకున్న ఈ నిర్ణయంతో ఇంతకాలం ప్రతిపక్ష ఇండియా బ్లాక్‌లో ఐక్యత లేదంటూ బిజెపి, జెడియు దళం లంకించుకున్న ప్రచారాన్ని తిప్పికొట్టినట్లయింది. మహా గట్‌బంధన్ ఇచ్చిన షాక్‌తో ఎన్‌డిఎ పరిస్థితి గుక్కతిప్పుకోలేకుండా ఉంది. తమ భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో ఎలాంటి ఇబ్బందులూ లేవని డాంబికాలు పలుకుతున్న ఎన్‌డిఎ తమ సిఎం అభ్యర్థి ఎవరో ఎన్నికల అనంతరమే ప్రకటిస్తామని బిజెపి, అమిత్‌షా దాటవేస్తూ వచ్చారు. జెడియు చీఫ్, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలో ఎన్‌డిఎ ఎన్నికలకు వెళుతోందని అంటూనే, ఈ సారి నితీష్ సిఎం అవుతారన్న గ్యారంటీ లేదని చెప్పకనే చెప్పారు. దీన్నిబట్టి నితీశ్ మెడపై బిజెపి కత్తి వేలాడతీసిందని అర్థమవుతుంది. బీహార్‌లో గత దశాబ్దంన్నరలో నితీష్ వేసిన వేషాలు అన్నీ ఇన్నీ కావు. పదవే లక్ష్యంగా కూటములు ఫిరాయించిన చరిత్ర ఆయన స్వంతం. ఆయన విధానాన్ని బిజెపి అందివచ్చిన ప్రతిసారీ వల వేసి ఉపయోగించుకుంది. 2020 అక్టోబర్-నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బిజెపి పంచన చేరి నితీష్ సిఎం అయ్యారు. ఆ పార్టీ తనను ఇబ్బంది పెడుతోందని పదవికి రాజీనామా చేసి మహ గట్‌బంధన్ వైపు వచ్చి తిరిగి సిఎం అయ్యారు. రెండేళ్లన్నా గడవక ముందే, సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముంగిట 2024 జనవరిలో ఎన్‌డిఎ తీర్థం పుచ్చుకొని పదవి కాపాడుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి కావాల్సిన సీట్లు తగ్గగా తన సీట్లతో భుజం కాసి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నితీష్ పార్టీకి బిజెపి కంటే తక్కువ సీట్లొచ్చినా ఆయన్నే సిఎం కుర్చీలో కూర్చోబెట్టామంటున్న బిజెపి ప్రస్తుత ఎన్నికల్లో తన గొంతును సవరిస్తోంది. మొత్తం 243 సీట్లలో బిజెపి, జెడియు చెరో 101 పోటీ చేసి, తతిమ్మా స్థానాలను తమ భాగస్వామ్య పార్టీలకు కేటాయించాయి. కూటమి విస్తృత ప్రయోజనాల కోసం తాము గతంలో పోటీ చేసిన సీట్ల కంటే ఇరువురం దిగొచ్చి తగ్గించుకున్నామని బిజెపి చెబుతున్నదాంట్లో నిజం కనిపించదు. రాష్ట్రంలో బలమైన ప్రాంతీయ పార్టీ జెడియును మింగేసి ఆ స్థానాన్ని బిజెపి ఆక్రమిస్తోందని క్యాన్నేళ్ల బీహార్ రాజకీయ పరిణామాలను బట్టి తెలుస్తుంది. బిజెపి ఈ నైజం పలు రాష్ట్రాల్లో ఇప్పటికే రుజువైంది. అందుకు తార్కాణం మహారాష్ట్రనే. సిఎం ఏక్‌నాథ్ షిండే (శివసేన (గ్రూపు) నేతృత్వంలో ఎన్‌డిఎ అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్నప్పటికీ బిజెపికి ఎక్కువ సీట్లు రావడంతో సిఎం పదవిని బిజెపి తీసుకొని కూటమి పొత్తు ధర్మానికి నీళ్లొదిలింది. అటువంటిదే బీహార్‌లో నితీష్ విషయంలో బిజెపి చేయదని గ్యారంటీ లేదు. బీహార్‌లో గెలిచేందుకు బిజెపి తొక్కని అడ్డదార్లు లేవు. ఎన్నికల సంఘాన్ని ప్రభావితం చేసి ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్)ను ప్రయోగించింది. ఇ.సి కి ఎంతమాత్రం సంబంధం లేని పౌరసత్వ నిర్ధారణ అంశాన్ని చేర్చేలా పావులు కదిపింది. దీనిపై ప్రతిపక్షాలు సుప్రీం కోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. ఏకంగా 65 లక్షల ఓట్లు తొలగించారు. దీనిపై విచారణకు సుప్రీం కోర్టు ఆదేశించినా ఇంకా పూర్తి స్థాయిలో విచారణ లేదు. ఓట్ల చోరీపై మహా గట్‌బంధన్ పెద్ద ఆందోళనే చేసింది. రెండు దశల ఎన్నికల్లో అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణకు గురువారంతో తుది గడువు ముగిసింది. మహా గట్‌బంధన్‌కు సంబంధించి 11 సీట్లలో స్నేహపూర్వక పోటీలు కొనసాగుతున్నాయి. నితీష్ ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందని ఇప్పటికే ముందస్తు సర్వేలు చెప్తున్నాయి. రాజ్యాంగ విధ్వంసానికి, నిరంకుశత్వానికి పాదుకొల్పుతున్న బిజెపిని నిలువరించడం అత్యవసరం. బీహార్‌లో బిజెపి, దాని మిత్రులను ఓడిస్తేనే కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వ మతతత్వ-కార్పొరేట్ విధానాలకు కొంత మేరకైనా బ్రేకులు పడతాయి. ఆ లక్ష్య సాధన కోసం తమలోని చిన్న చిన్న ఇబ్బందులను పరిష్కరించుకొని మహా గట్‌బంధన్ పని చేయాలని రాజ్యాంగ ప్రేమికులు, ప్రజాస్వామ్యవాదులు కోరుకుంటున్నారు.

# టీచర్లపై 'ఎన్నికల' ఒత్తిళ్లు



హైదరాబాద్,సమస్య పాతదే. ఎన్నికల రుతువు సమీపించినప్పుడల్లా ఉపాధ్యాయులు ఓటర్ల జాబితా సవరణ మొదలుకొని పోలింగ్ నిర్వహణ విధుల వరకూ ఎన్నెన్నో నిర్వహించక తప్పదు. వారినుంచి ప్రతిసారీ అభ్యంతరాలు, నిరసనలు కూడా రివాజే. ఈసారి సమస్యాత్మకమైన బెంగాల్ వంతు వచ్చింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నందున బిహార్ మాదిరిగా అక్కడ కూడా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎన్నికల సంఘం(ఈసీ) సన్నాహాలు చేస్తోంది. అందులో పాలుపంచుకోనేది లేదని రెండు నెలలుగా టీచర్లు చెబుతున్నారు. ఈసీ ఆదేశాలను పాటించి తీరాలని గత నెలలో కలకత్తా హైకోర్టు వారిని హెచ్చరించింది. అయినా దానివల్ల పెద్దగా ఫలితం కనబడలేదు. పైకి ఏం చెప్పినా సర్వసాధారణంగా ఉపాధ్యాయుల నిరాకరణకు రెండు కారణాలుంటాయి. అందులో ఒకటి%-% పార్టీల నుంచి వచ్చే ఒత్తిళ్లు. రెండోది విద్యా సంబంధమైనది. పార్టీలు తెచ్చే ఒత్తిళ్లు అన్నీ ఇన్నీ కాదు. ఫలానా పేర్లు తీసేయాలని కోరటం, లేదా ఫలానా డోర్ నంబర్ కింద పేర్లు చేర్చాలని ఒత్తిడి చేయటం మామూలే! 'మా ఓటు గల్లంతైంద'ని పోలింగ్ రోజున పలువురు లబోదిబోమంటారు. నకిలీ ఓటర్లు జాబితాలోకెక్కిన సందర్భాల్లో ఫిర్యాదులుండవు. ఎందుకంటే తమ అడ్రస్‌తో నకిలీలు రిజిస్టరయ్యారన్న సంగతి ఇళ్ల యజమానులకు తెలియదు. పార్టీలు గమనించి ఫిర్యాదు చేసేసరికి సమయం మించిపోతుంది. ఈసారి వివాదాస్పదమైన 'సర్' అడుగుపెడుతున్నది గనుక సమస్య మరింత జటిలం కాబోతోంది. ఇన్నాళ్లూ పార్టీల నుంచి ఎదురైన ఒత్తిళ్లు వేరు. ఇది వేరు. కొత్త విధానం ప్రకారం నిర్దిష్టమైన పత్రాలుంటేనే ఓటర్లుగా గుర్తిస్తారు. ఆ పత్రాలు లేకుంటే అంతే సంగతులు. అందువల్లే ఈసారి జాబితా విడుదలైన వెంటనే ఓటు ఉందో ఊడిందో చూసుకునే ఓటర్లు ఎక్కువే ఉంటారు. తమవారి పేర్లున్నాయో లేదో వెంటవెంటనే నిశితంగా గమనించే పార్టీలూ ఉంటాయి. పేరు గల్లంతైతే రాజకీయ పక్షాల నేతలైనా, జనమైనా విరుచుకుపడేది బీఎల్‌ఓలపైనే! బిహార్‌లో ఎంతో పకడ్బందీగా ఓటర్ల జాబితాను సవరిస్తున్నామని ఈసీ చెబుతుండగానే అనేక లొసుగులు బయటపడ్డాయి. పెంపుడు కుక్కల పేర్లతో, సినీతారల పేర్లతో నమోదైన 'ఓటర్లు' కొందరుంటే... ఏకంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు కూడా జాబితాలో చేరి అందరినీ నిర్ఘాంత పరిచింది. బెంగాల్ తీరు వేరు. అధికారంలో ఉన్న తృణమూల్ అయినా, ఈసారి గెలిచి తీరాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ అయినా 'సర్' ప్రక్రియ మొదలైనప్పటినుంచీ తమ సర్వశక్తులూ కేంద్రీకరిస్తాయి. నమోదు సమయంలోనే బీఎల్‌ఓలు 'ఫలానా పత్రం ఇస్తే తప్ప కుదరద'ంటే ఒత్తిళ్లూ, బెదిరింపులూ తప్పవు. కొన్ని సందర్భాల్లో దాడులకు దిగేవారూ ఉంటారు. వాటికి జడిసి చూసీచూడనట్టు వెళ్తే ప్రత్యర్థి పార్టీలు రచ్చచేస్తాయి. తప్పని తేలితే బీఎల్‌ఓలపై క్రమశిక్షణ చర్యలుంటాయి. వారి సర్వీస్‌పై మచ్చ పడుతుంది. ఉపాధ్యాయులు మీవల్లే బీఎల్‌ఓ విధులు నిర్వర్తించేందుకు భయపడుతున్నారంటూ తృణమూల్, బీజేపీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఇక ఈసీ పక్షపాత వైఖరి గురించి వచ్చే ఆరోపణల సంగతి సరేసరి. ఈ బెడదంతా ఎందుకున్న ఉద్దేశంతోనే టీచర్లు ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని చూస్తున్నారు. టీచర్లకు ఎన్నికల సంబంధ విధులే కాదు... విద్యేతరమైనవి అనేకం చుట్టుకుంటున్నాయి. చదువు చెప్పటంతోపాటు పాఠశాలల్లో పర్యవేక్షించాల్సినవే అనేకం ఉంటున్నాయి. ఇన్నింటివల్ల సకాలంలో సిలబస్ పూర్తిచేయటం కష్టమవుతోందనీ, పిల్లల ప్రమాణాలు పడిపోతున్నాయనీ ఉపాధ్యాయులంటారు. ఈ రెండింటికీ తమనే బాధ్యుల్ని చేస్తున్నారన్నది వారి ఆవేదన. ఒకరో ఇద్దరో టీచర్లతో నడిచేచోట ఈ కష్టాలు అనేక రెట్లు ఎక్కువుంటాయి. ఈసీకి ఇదంతా అనవసరం. కేటాయించిన విధుల్ని పరిపూర్తి చేయాల్సిందేనంటుంది. ఎన్నికల విధుల్లో పాల్గొని తీరాలన్న ఈసీ ఆదేశాలపై 2014లో మహారాష్ట్ర ఎయిడెడ్ స్కూళ్ల టీచర్లు బొంబాయి హైకోర్టులో సవాలు చేసినప్పుడు విధులకు గైర్హాజరైనవారిపై కఠిన చర్యలు తీసుకోబోమని ఈసీ హామీ ఇచ్చింది. ఇప్పుడు బెంగాల్ టీచర్లకు ఉపశమనం దొరుకుతుందా లేదా అన్నది వేచిచూడాలి.

# హ్యామ్ టెండర్లలో 8వేల కోట్ల కుంభకోణం

హైదరాబాద్, ఇందిరమ్మ రాజ్యంలో రోజుకో అవినీతి, పూటకో కుంభకోణం బయటపడుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ఓ పని టెండర్‌కు సంబంధించి మంత్రుల మధ్య వివాదం తలెత్తితే సీఎం ఇద్దరినీ కూర్చో బెట్టి వాటాలు పంచారని ధ్వజమెత్తారు. డెక్కన్ సిమెంట్స్ కంపెనీ వారిని గన్ పెట్టి బెదిరించారని, ఇందులో సీఎం పాత్ర ఉందని మంత్రి కూతురే ఆరోపించారన్నారు. ముఖ్యమంత్రి, సీఎం పేషీ మీద వచ్చిన ఆరోపణలు ప్రజలకు తెలుసునని చెప్పారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, డాక్టర్ కే. సంజయ్, పార్టీ నేతలు ఆయాచితం శ్రీధర్, కే. కిషోర్ గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మద్యం సీసాల హోలోగ్రాం కుంభకోణంలో సీఎం, మంత్రి మధ్య తలెత్తిన వివాదంలో అధికారిని బలి చేశారని మండిపడ్డారు. అవినీతి, ముడుపుల మీద మంత్రులు రోజూ కొట్లాడుకుంటున్నారని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యమంటే కుంభకోణాల నిలయం, అవినీతి మయంగా మారిందన్నారు. తెలంగాణలో రోడ్లకు మహర్దశ అని మంత్రులు అంటున్నారని, రూ.27 వేల కోట్లతో రోడ్లు వేయబోతున్నామని మంత్రులు చెప్పారని, ఇందులో వేల కోట్ల కుంభకోణం ఉందని ఆరోపించారు. హ్యామ్ కాదు.. అది ఒక పెద్ద స్కామ్ అని, రోడ్డు బాగుచేసే ముసుగులో దోపిడీకి రంగం సిద్ధమైందన్నారు. 'హైబ్రిడ్ అన్యుటీ మోడ్ (హ్యామ్ ) టెండర్లలో రూ.8 వేల కోట్ల కుంభకోణం జరిగింది. హ్యామ్‌లో కిలోమీటర్‌కు 85 శాతం అంచనా వ్యయం పెంచారు. రూ.9 వేల కోట్లతో పూర్తయ్యే రోడ్లకు రూ.17 వేల కోట్లకు టెండర్లు పిలిచారు. ఇందులో రూ.8 వేల కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం లూటీ చేస్తున్నది. సీఆర్ఎఫ్ కింద కిలోమీటర్‌కు రూ.కోటి 75 లక్షలు ఖర్చు అవుతుంది. హ్యామ్ కింద ఇచ్చిన టెండర్లలో కిలోమీటర్‌కు రూ.3కోట్ల 30 లక్షల వ్యయం అవుతుంది. సీఆర్ఎఫ్ కింద ఇచ్చిన రోడ్ల పనుల టెండర్ల జీవో, హ్యామ్ జీవో కేవలం పది రోజుల తేడాలో వచ్చాయి. సీఆర్ఎఫ్ కింద ఇచ్చిన జీవోలో కిలో మీటర్‌కు ఓ రేటు, హామ్ జీవోలో మరో రేటు ఎలా ఉంటుంది. హ్యామ్ రోడ్ల టెండర్లు దక్కించుకున్న వారికి 10 శాతం మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ రూ.17 వేల కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్సులు ఎవరి జేబుల్లోకి వెళ్తాయో అందరికీ తెలుసు. హ్యామ్ కింద కిలోమీటర్ రోడ్డుకు మెయింటెనెన్సుకు మరో రూ.2.5 కోట్లు కేటాయిస్తున్నారు. అంటే కిలోమీటర్ రోడ్డుకు హామ్ కింద రూ.6 కోట్లు ఖర్చవుతుంది. హ్యామ్‌లో 40 శాతం ప్రభుత్వం, 60 శాతం ప్రైవేటు సంస్థలు భరిస్తాయని అంటున్నారు. ప్రైవేటు సంస్థలు బ్యాంకుల నుంచి తెచ్చే అప్పులకు ప్రభుత్వమే వడ్డీ కట్టాల్సి ఉంటుంది. మొత్తం మీద హ్యామ్ మోడల్ ప్రజల మీద పెను భారం మోపేదిగా ఉంది. ఈ టెండర్లను తక్షణమే రద్దు చేయాలి. హ్యామ్ రోడ్లలో పాలుపంచుకుంటున్న ఇంజినీర్లు, అధికారులు, బడా కాంట్రాక్టర్లు ప్రభుత్వ దోపిడీలో భాగస్వామ్యం కావద్దని మనవి. ఇందులో పెద్ద అవినీతి జరుగుతున్నందున కేంద్ర దర్యాప్తు సంస్థలు తక్షణమే జోక్యం చేసుకోవాలి. ఇద్దరు కేంద్ర మంత్రులు రాష్ట్రం నుంచి ఉన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా హ్యామ్ టెండర్లపై సీబీఐ దర్యాప్తు చేయించాలి. దోచుకునే విషయంలోనే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్ అయ్యింది. ఢిల్లీకి మాటి మాటికీ సీఎం వెళ్లేది తన అవినీతి నుంచి కాపాడుకునేందుకే. పనులు చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వరు కానీ హ్యామ్ కింద మొబిలైజేషన్ అడ్వాన్సులు ఎలా చేస్తారు?. హ్యామ్ రోడ్ల నిబంధనలు చిన్న కాంట్రాక్టర్లకు హాని చేసే విధంగా ఉన్నాయ్. రూ.8 వేల కోట్ల ప్రజా ధనాన్ని లూటీ చేసే విధంగా ఉన్న హామ్ రోడ్ల టెండర్లపై ప్రతి వేదిక మీద మా గొంతు ఎత్తుతాం' అని చెప్పారు.

# వంతెనలపై రాజకీయ రగడ



నిజామాబాద్,నిజామాబాద్ జిల్లాలో ఏళ్ల తరబడిగా సాగుతున్న వంతెనల నిర్మాణాలు రాజకీయ రగడకు దారితీస్తున్నాయి. ఇద్దరు దిగ్గజ నేతలు ఒకరి మీద ఒకరు ఉరుముతున్నారు. నిజామాబాద్ నగర శివారులో రెండు వైపుల సాగుతున్న రెండు వంతెనల నిర్మాణాల్లో జాప్యం రెండు జాతీయ పార్టీల నేతల మధ్య రాజకీయ రచ్చకు తెరలేపాయి. ఈ వివాదం ఇప్పుడు ఎంపి అర్వింద్ వర్సెస్ పిసిసి చీఫ్ మహేశ్‌గా మారింది. వారం రోజుల గడువులో జిల్లా పర్యటనకు వచ్చిన ఈ ఇద్దరు నేతలు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనే ఇద్దరి నేతల మధ్య మాట యుద్ధానికి దారి తీసినట్లయింది. పదిహేను రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం వంతెనకు అవసరమైన నిధులు ఇవ్వకపోతే నిరాహార దీక్షకు దిగుతాననంటూ ఎంపి అర్వింద్ ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. నిజామాబాద్ శివారు ప్రాంతాలైన మాధవనగర్, ఆర్సపల్లిలో రైల్వేట్రాక్‌లపై రెండు వంతెనల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితమే నిధులు మంజూరు చేసింది. కానీ ఇందులో రాష్ట్ర ప్రభుత్వం గ్రాంటు కూడా అనివార్యం కావడం వంతెనల నిర్మాణానికి శాపంగా మారింది. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే వంతెనలు ప్రారంభమయ్యాయి.పనులు మొదలైనప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు క్లియర్ కావడంలో పేచి మొదలైంది. దీంతో గుత్తేదారు తరచూ పనులను నిలిపివేస్తూ వచ్చారు. సహజంగానే నిర్మాణం జరుగుతున్న పనుల జాప్యంపై ప్రజల్లో అసహనం వ్యక్తమైంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఎంపి అర్వింద్ నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఈ వంతెనలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయించారు. ఆ తర్వాత కథ షరా మామూలైంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు మంజూరు చేయడం లేదంటూ బిజెపి నేతలు గత పది రోజుల క్రితమే మాధవనగర్ వంతెన వద్ద ఆందోళన చేశారు. ప్రభుత్వ మొండి వైఖరిని బిజెపి నేతలు ఎండగట్టారు. వారం రోజుల గడువులోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిజామాబాద్ నగరానికి వచ్చారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తల్లి దినకర్మకు వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి కలవడానికి బిజెపి ఎంఎల్ఎ ఏకంగా రోడ్డు మీదే బైఠాయించారు.వరికి రేవంత్ కలిసి ఇదే విషయమై వినతి పత్రం ఇచ్చారు. బిజెపి నేతలు బైఠాయించిన ఘటనపై మరుసటి రోజు పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ ఘాటుగా స్పందించారు. అర్వింద్‌ను టార్గెట్ చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వెంటనే ఇప్పించాలన్నారు. ఈ మేరకు ఆయన సంబంధిత అధికారులతోనూ వంతెన పనుల పురోగతిని ఆరా తీశారు. రెండు రోజుల తర్వాత జిల్లాకు వచ్చిన ఎంపి అర్వింద్ సైతం మహేశ్ వ్యాఖ్యలపై గట్టిగా కౌంటర్ ఇచ్చారు. మాధవనగర్ ఒక్కటే కాదు జిల్లా లో కేంద్రం వాటా నిధులు మంజూరు అయినా పనులకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వడంలో ఎలా జాప్యం చేస్తుందో ఏకరువు పెట్టారు. మాధవనగర్ వంతెన పనులు రాష్ట్ర ప్రభుత్వ నిర్వాహకం వల్లే ఆగిపోయాయని పది రోజుల్లో నిధులు ఇవ్వకపోతే ఎంపిగా తానే నిరాహార దీక్షకు దిగుతానని అర్వింద్ అల్టిమేటం ఇచ్చారు.అసలు తాను ఇప్పటి దాకా ఎప్పుడు దీక్ష చేయలేదని కానీ వంతెన నిధులకు తప్పడం లేదని చెప్పారు. అర్వింద్ ఎదురు దాడికి ఇంకా కాంగ్రెస్ నుంచి ఎలాంటి కౌంటర్ మాత్రం రాలేదు. మాధవనగర్ రైల్వేట్రాక్ వద్ద వంతెన పనులు ఏళ్ల తరబడిగా సాగుతుండడంతో రోజు హైదరాబాద్ వైపు వెళ్లే వేలాది మంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఎంపి అవ్వకముందే అర్వింద్ మాధవనగర్ వద్ద రైల్వే వంతెన డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ఆయన ఎంపి అవ్వగానే ఆరు నెలలోనే నిధులు మంజూరు చేయించారు. అందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు తప్పనిసరిగా ఉండాలని కేంద్రం మెలికపెట్టింది. దీనితో అప్పటి నుంచే ఈ వంతెన రాజకీయ రచ్చకు వేదిక అయింది. ఆర్ అండ్‌బి మంత్రి ప్రశాంత్‌రెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తే అయినా వంతెన ఖ్యాతి అర్వింద్ రాకుండా సర్వశక్తులు ఒడ్డారు.కానీ అప్పట్లోను అర్వింద్ మరోసారి ఈ నిధుల కోసం రోడ్డెక్కడానికి సిద్ధం అయ్యారు. దీనితో ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. కానీ టెండర్ల ప్రక్రియ దాటుకొని పనులు మొదలు కావడంలో నెలల తరబడి జాప్యం జరిగింది. పనులే ఆలస్యంగా మొదలు పెట్టించిన సర్కార్ గుత్తేదారుకు నిర్ణీత కాలంలో బిల్లులు క్లియర్ చేయలేకపోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఎంపి అర్వింద్ నేరుగా సిఎం రేవంత్‌ను కలిసి గుత్తేదారుకు పెండింగ్ ఉన్న బిల్లులు క్లియర్ చేయించారు. దీనితో ఆరు నెలలు పనులు శరవేగంగా సాగాయి. ఆ తర్వాత కథ మళ్ళీ మొదటికి వచ్చింది. ఆరు కోట్ల రూపాయల మేరకు బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు వేగంగా మంజూరు చేస్తూ పనులు చేయిస్తే కేంద్రం కూడా నిర్ణీత గడువులోనే నిధులు మంజూరు చేస్తుందని అర్వింద్ చెప్తున్న మాట. కానీ కేంద్రం ఇవ్వాల్సిన ఫండ్‌ను ఇవ్వకపోవడం వల్లే పనులు ఆలస్యం అవుతున్నాయనేది అధికార పార్టీ నేతలు అంటున్నారు. మొత్తానికి ఈ వివాదం రాజకీయ రగడగా మారింది. అర్వింద్ అల్టిమేటం ప్రభుత్వం ఎలా స్పందిస్తుందోనన్నదే ఆసక్తిగా మారింది.

# ఈ దశాబ్దం మోదీదే

అమరావతి,ఈ దశాబ్దం మోదీదే అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఎన్డీయే ప్రగతిశీల ప్రభుత్వమని కొనియాడారు.కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం సామాన్యుల సాధికారతే లక్ష్యంగా సంస్కరణలు తీసుకువస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఎన్నికల హామీ 'సూపర్ సిక్స్'ను విజయవంతంగా అమలు చేస్తోందని వెల్లడించారు. జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భాగంగా వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. బిహార్ సీఎం నీతీశ్ కుమార్, అధికార కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తానని వెల్లడించారు. 'భారత్‌లో ఎంతో ఆసక్తిని కలిగించే అంశాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధాని మోదీ 2000 సంవత్సరం నుంచి రాజకీయాల్లో ఉన్నారు. ఆయన ఎల్లప్పుడూ ఎన్నికల్లో విజయం సాధిస్తూనే ఉంటారు. గతంలో ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2014 నుంచి 11 ఏళ్లుగా ప్రధానిగా కొనసాగుతున్నారు. మరో నాలుగు సంవత్సరాలు ఆయనే ఉంటారు. ఈ దశాబ్దం మోదీ (ఖఓ ఓనీటతి)దే. అంటే ఆటోమెటిగ్గా భారతీయులదే' అని చంద్రబాబు వెల్లడించారు. ఇటీవల కేంద్రం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలపై చంద్రబాబు మాట్లాడారు. వాటివల్ల ప్రజల సేవింగ్స్ పెరుగుతాయని తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగం, ఇతర వ్యాపారవేత్తలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఏ దేశ తలసరి ఆదాయంలోనైనా ఆ దేశంలో నివసించే భారతీయులదే ఆధిపత్యం అని ప్రస్తుతం దుబాయ్ పర్యటనలో ఉన్న ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెంచేందుకు పలువురు వ్యాపారవేత్తలతో భేటీ అయ్యారు. వచ్చే నెలలో విశాఖపట్నంలో జరిగే సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానించారు. వచ్చే నెలలో ఆర్సెలార్‌మిత్తల్ నిప్పాన్ స్టీల్ ఎ÷-లాంట్‌కు ఆంధ్రాలో శంకుస్థాపన జరగనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, వ్యవసాయం, ఉద్యానరంగం, లాజిస్టిక్స్, రాజధాని నగరం అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 750 వరకు సేవలను వాట్సప్ ద్వారా అందిస్తున్నామంటూ రియల్ టైమ్ గవర్నెన్స్ గురించి పేర్కొన్నారు. అలాగే తెలుగు కమ్యూనిటీ గురించి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఒకరోజు ఈ గ్రహంపై అత్యంత ప్రభావవంతమైన సమాజంగా తెలుగు కమ్యూనిటీ నిలుస్తుందని, ఆ దిశగా ప్రణాళికలు చేస్తున్నామని వెల్లడించారు. గత 15 నెలల్లో తమ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సేకరించిందని, మరో రూ.5లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

# బీహార్‌లో వేడెక్కుతున్న రాజకీయం !

బీహార్,బీహార్ శాసనసభ ఎన్నికల వేళ విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రచారం వేడెక్కింది. ఆర్‌జెడి పరిపాలన నాటి అవినీతి గురించి వందేళ్లయినా చర్చించుకుంటారని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై ఆర్జెడి నేత తేజస్వి యాదవ్ ఘాటుగానే స్పందించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో బీహార్‌కు ఒరిగిందేమిటని నిలదీశారు. ఇకపోతే ఇక్కడ ఎన్నికలను ఎదుర్కొంటున్న ఇండియా బ్లాక్ మహా ఠట్‌బంధన్ తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్‌ను ఏకాభిప్రాయంతో ప్రకటించి అధికార జెడియు నేతృత్వంలోని ఎన్‌డిఎకి తిరుగులేని సవాల్ విసిరింది. అయితే కూటమి నేతల మధ్య ఏకాభిప్రాయం మాత్రం కుదరలేదు. అందుకే పలుచోట్ల పరస్పర పోటీకి దిగారు. దీనికితోడు ప్రచార పోస్టర్లలో రాహుల్ బొమ్మ లేకుండా ఆర్‌జెడి ముందుకు వెళుతోంది. ఇవే అంశాలను ఎన్‌డిఎ ఎత్తిచూపు తోంది. వారిమధ్యన పొత్తులే సరిగా లేవని, అది మహాగట్‌బంధన్ ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. ప్రశాంత్ కిశోర్ పార్టీ ఏ మేరకు ప్రభావం చూపుతుందన్నది కూడా ముఖ్యం. పికె కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న ఈ రెండు కూటములను నిలవరించి ముందుకు రావడం కష్టమే. అలాగని హంగ్ ఏర్పడుతుందని ఎక్కడా చెప్పడం లేదు. బీహార్‌లో గత దశాబ్దంన్నర పాలనా కాలంలో నితీష్ వేసిన వేషాలు అన్నీ ఇన్నీ కావు. పదవే లక్ష్యంగా కూటములు ఫిరాయించిన చరిత్ర ఆయన స్వంతం. ఆయన విధానాన్ని బిజెపి అందివచ్చిన ప్రతిసారీ వల వేసి ఉపయోగించుకుంది. 2020 అక్టోబర్-నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బిజెపి పంచన చేరి నితీష్ సిఎం అయ్యారు. ఆ పార్టీ తనను ఇబ్బంది పెడుతోందని పదవికి రాజీనామా చేసి మహా ఘట్‌బంధన్ వైపు వచ్చి తిరిగి సిఎం అయ్యారు. రెండేళ్లన్నా గడవక ముందే, సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముంగిట 2024 జనవరిలో ఎన్‌డిఎ తీర్థం పుచ్చుకొని పదవి కాపాడుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి కావాల్సిన సీట్లు తగ్గగా తన సీట్లతో భుజం కాసి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నితీష్ పార్టీకి బిజెపి కంటే తక్కువ సీట్లొచ్చినా ఆయన్నే సిఎం కుర్చీలో కూర్చోబెట్టామంటున్న బిజెపి ప్రస్తుత ఎన్నికల్లో తన గొంతును సవరిస్తోంది. మొత్తం 243 సీట్లలో బిజెపి, జెడియు చెరో 101 పోటీ చేసి, తతిమ్మా స్థానాలను తమ భాగస్వామ్య పార్టీలకు కేటాయించాయి. కూటమి విస్తృత ప్రయోజనాల కోసం తాము గతంలో పోటీ చేసిన సీట్ల కంటే ఇరువురం దిగొచ్చి తగ్గించుకున్నామని బిజెపి చెబుతున్నదాంట్లో నిజం కనిపించదు. రాష్ట్రంలో బలమైన ప్రాంతీయ పార్టీ జెడియును మింగేసి ఆ స్థానాన్ని బిజెపి ఆక్రమిస్తోందని

# ఏపి ప్రగతిలో కొత్త భాగస్వామ్యం

హైదరాబాద్,ఆస్ట్రేలియాలో 7 రోజుల పర్యటనతో.. ఆంధ్రప్రదేశ్ ప్రగతి దిశగా కొత్త భాగస్వామ్యాలపై నమ్మకం కుదిరిందని ఏపీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. నాలుగు నగరాల పర్యటనలో విశ్వవిద్యాలయాల సందర్శన, పారిశ్రామికవేత్తలతో భేటీలు జరిగాయని తెలిపారు. క్రీడలను శక్తిమంతమైన రంగంగా అభివృద్ధి చేసే అవకాశాలు విస్తారంగా ఉన్నాయన్నారు. భారతదేశం 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు సాగుతోందని చెప్పారు. ఈ సమయంలో, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ శక్తి బలోపేతం కావడం కీలకమని పేర్కొన్నారు.

## వైద్యురాలి ఆత్మహత్యపై దర్యాప్తు

ముంబై,మహారాష్ట్రలో ఓ మహిళా వైద్యురాలి (26) ఆత్మహత్య సంచలనంగా మారింది. సతారా జిల్లా ఆస్పత్రిలోనే వైద్యురాలు ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు ముందు నాలుగు పేజీల సూసైడ్ నోట్ రాసిపెట్టింది. ఎస్ఐ గోపాల్ బద్నే తనను శారీరకంగా, మానసికంగా వేధించాడని ఆరోపించింది. ఐదు నెలల్లో పలుమార్లు తనపై అత్యాచారం చేశాడని ఆరోపించింది. అతడి వేధింపుల వల్లే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలిపింది. పై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితురాలు వాపోయింది. ఇక సూసైడ్ నోట్‌లో అనేక సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఓ ఎంపీ, అతడి సహాయకుల నుంచి తీవ్రమైన బెదిరింపులు వచ్చాయని ఆరోపించింది. ఇక వైద్య పరీక్షలకు తీసుకురాకుండానే నిందితులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలంటూ పోలీసులు పదేపదే తనపై ఒత్తిడి తెచ్చారని తెలిపింది. అందుకు నిరాకరించడంతో ఎస్ఐ గోపాల్ బద్నేతో పాటు మరికొందరు పోలీసు అధికారులు తనను వేధింపులకు గురిచేశారని ఆరోపించింది. ఇక ఎస్ఐ గోపాల్ బద్నే తనపై ఐదు నెలలుగా అత్యాచారం చేస్తున్నాడని.. పైగా మానసికంగా, శారీరకంగా హింసించాడని వాపోయింది. ఇంటి యజమాని కుమారుడు ప్రశాంత్ బంకర్‌పై కూడా ఇవే రకమైన ఆరోపణలు వైద్యురాలు చేసింది. సూసైడ్ నోట్ ఆధారంగా ఎస్ఐ గోపాల్ బద్నే, ఇంటి యజమాని కుమారుడు ప్రశాంత్ బంకర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే విచారణలో ఎస్ఐ గోపాల్ బద్నే–వైద్యురాలు బంధువులేనని తేలింది. బంధువు ముసుగులో ఎస్ఐ.. వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడినట్లు గుర్తించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం పొలిటికల్ టర్న్ తీసుకుంది. బీజేపీ కూటమి ప్రభుత్వం నిందితులను కాపాడుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నామ్‌దేవ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో కీలక పోస్టు పెట్టారు. రక్షించాల్సి పోలీసులే.. వైద్యురాలిపై వేధింపులకు పాల్పడటాన్ని తప్పుబట్టారు. తొలుత ఆమె పై అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడే ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం పదేపదే పోలీసులను రక్షిస్తోందని.. అందుకే దురాగతాలు పెరిగిపోయాయని విమర్శించారు. ఆరోపణలను బీజేపీ నాయకురాలు చిత్ర వాఘ్ ఖండించారు. ఇది సంఘటన దురదృష్టకరమని, ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుపుతామని హామీ ఇచ్చారు.

## భారీగా దగ్ధమైన లిక్కర్ నిల్వలు

హైదరాబాద్,హైదరాబాద్ నగరంలోని మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇండియన్ కంటైనర్స్ కార్పొరేషన్ డిపోలో ఫైర్ యాక్సిడెంట్ జరిగింది. గోదాంలో నిల్వ ఉంచిన రసాయన విభాగంలో మంటలు ఎగిసిపడ్డాయి. కార్పొరేషన్ గోదాంలో ఉన్న లిక్కర్ నిల్వ ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి 6 ఫైర్ ఇంజన్లు చేరుకుని,నలువైపుల నుంచి మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నించారు. మంటల్లో పెద్ద ఎత్తున లిక్కర్ దగ్ధమైనట్లు అధికారులు గుర్తించారు. కోట్ల రూపాయల్లో ఆస్తి నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ఈ అగ్నిప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## లక్షల్లో జరిమానాలు విధింపు

అమరావతి, కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంతో ఆర్టీఏ అధికారులు అప్రమత్తం అయ్యారు.. ఇటు, తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్.. మరోవైపు బెంగళూరులోనూ ఆర్టీఏ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.. దీంతో, కాలం చెల్లిన బస్సులను రోడ్డుపైకి రాకుండా ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.. మరోవైపు.. కర్నూలులో బస్సు ప్రమాదం దృష్ట్యా ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు రవాణా శాఖ అధికారులు.. రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రైవేట్ వాహనాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు.. నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్ బస్సులపై ఈ రోజు ఇప్పటికే 289 కేసులు నమోదు చేశారు.. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 18 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను సీజ్ చేశారు.. విజయవాడలో సాయంత్రం వరకు దాడులు కొనసాగాయి. ఆర్టీఏ అధికారుల తనిఖీలు.. చేసి అగ్నిమాపక పరికరాలు లేని ప్రైవేటు ట్రావెల్స్‌కు భారీగా జరిమానాలు విధించారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై ఇప్పటి వరకు 7.08 లక్షల రూపాయల వరకు జరిమానా విధించారు.. అత్యధికంగా ఏలూరులో 55 కేసులు నమోదు కాగా.. 3 ట్రావెల్స్ బస్సులు సీజ్ చేశారు.. తూర్పు గోదావరి జిల్లాలో 17 కేసులు నమోదు కాగా.. 4 బస్సులు సీజ్.. కోనసీమ జిల్లాలో 27, చిత్తూరు జిల్లాలో 22, కర్నూలు జిల్లాలో 12, విశాఖలో 7, నంద్యాలలో 4 కేసులు నమోదు చేశారు అధికారులు.. సరైన ధ్రువపత్రాలు లేని 8 బస్సులు, అత్యవసర ద్వారం లేని 13 బస్సుల్లు, ఎ+ర్ పరికరాలు లేని 103 బస్సులు, ప్యాసింజర్ లిస్టు లేని కారణంగా 34 బస్సులు, ఇతర ఉల్లంఘనలపై 127 బస్సులపై కేసులు నమోదయ్యాయి.. ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.. మరోవైపు.. ఇప్పటికే విజయవాడ నుంచి బెంగళూరు, హైదరాబాద్ వైపు వెళ్లే పలు ప్రైవేట్ ట్రావెల్స్ బుకింగ్స్ రద్దు చేస్తున్నాయి పలు ట్రావెల్స్ సంస్థలు.

## వైసీపీలో ఎన్నో విభాగాలు...వేలాదిగా పదవులు కానీ !

వైసీపీ ఒక ప్రాంతీయ పార్టీ. ఇంకా గట్టిగా చెప్పాలంటే కేవలం ఏపీకి మాత్రమే పరిమితం అయిన పార్టీ. వైసీపీకి తెలంగాణాలో కూడా బలం ఉంది. వైసీపీ అధినేత జగన్ తెలంగాణాలో ఓదార్పు యాత్రలు నిర్వహిస్తే పెద్ద ఎత్తున జనాలు తరలివచ్చారు. ఆయనకు ఈ రోజున అక్కడ మంచి క్రేజ్ ఉంది. 2014 ఎన్నికల్లో మూడు ఎమ్మెల్యే సీట్లు ఒక ఎంపీ సీటు వైసీపీకి గెలుచుకుంది. ఆ తరువాత మాత్రం తెలంగాణాలో పోటీ చేయలేదు, కేవలం ఏపీకే పరిమితం అయింది. ఇదిలా ఉంటే వైసీపీ ఏపీలో తన ప్రస్థానం లో రెండు సార్లు విపక్షంలో ఒకసారి అధికార పక్షంలో ఉంది. వైసీపీ అధికారంలో ఉన్నపుడు పంచాయతీ వార్డు మెంబర్ నుంచి పార్లమెంట్ దాకా అంతా తానే అయింది. దాంతో అలా గ్రాస్ రూట్ లెవెల్ దాకా తన బలాన్ని పెంచుకుంది.

**ఓటమి తరువాత :**


ఏ పార్టీకి అయినా ఓటమి అతి పెద్ద దెబ్బగా చూస్తారు. వైసీపీ విషయం తీసుకుంటే 2024 ఎన్నికల్లో భారీ ఓటమి సంప్రాప్తించింది. అది కూడా అలా ఇలా కాదు, ఏకంగా 11 సీట్లకే పరిమితం అయింది. వైసీపీకి వచ్చిన నలభై శాతం ఓట్లకు 11 సీట్లకు ఎక్కడా సంబంధం అయితే లేదు. ఏపీ అసెంబ్లీలో విపక్ష హోదా కూడా వైసీపీకి దక్కలేదు. దాంతో వైసీపీకి ఇది భారీ షాక్ గానే అంతా భావిస్తున్నారు. వైసీపీ తిరిగి కోలుకుని తీరు ఎలా ఉంటుంది అన్నది కూడా అంతా గమనిస్తున్నారు.

**ప్రస్థానం మొత్తం :**

వైసీపీ పార్టీ పెట్టిన దగ్గర నుంచి చూస్తే ఎక్కువ కాలం విపక్షంలోనే గడిపింది. 2011లో వైసీపీని స్థాపించారు. అప్పట్లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. విభజనతో తెలుగుదేశానికి పోటీగా మరో పార్టీగా వైసీపీ ఉంది. 2014లో వైసీపీ ఓడి మరో అయిదేళ్ళు విపక్ష స్థానంలో కొనసాగింది. ఇక 2019 నుంచి 2024 దాకా కేవలం అయిదేళ్ల పాటు అధికారంలో ఉంది. ఇప్పటికి చూసుకుంటే వైసీపీ పదిహేనేళ్ల రాజకీయ ప్రయాణంలో పదేళ్ళ పాటు ప్రతిపక్ష పాత్రకే పరిమితం అయినట్లుగా చూడాల్సి ఉంది.

# హృదయం.. పదిలం

సెంట్రల్ డెస్క్:నాకు పర్ఫెక్ట్ డ్రైవింగ్ వస్తుంది. ఇన్ని సంవత్సరాల నా డ్రైవింగ్ సర్వీసులో ఎప్పుడు కూడా ఎలాంటి చిన్న రోడ్డు ప్రమాదం చేయలేదు అనే ధీమాతో రోడ్లపై వాహనాల సీనియర్ డ్రైవర్లు అనుకోవడం మనకు తెలిసిందే. మనకు డ్రైవింగ్ సరిగానే వస్తుంది కానీ ఎదురుగా వచ్చే వాహనం డ్రైవర్ సరిగా లేకుంటే అది మనకు ప్రమాదమే. ఈ చిన్న విషయాన్ని గమనిస్తే రోడ్డు ప్రమాదాలు కొన్ని తగ్గుతాయి. వేగం తగ్గిస్తే ఎదుటి వారి నుండి మనం రక్షించుకునే అవకాశం ఉంటుంది. ఎలిమెంట్లు లేకుండా, అధిక లోడుతో, అతి వేగంతో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలలో కనురెప్పపాటులో ప్రాణాలు వదులుతూ లక్షలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ రోడ్డు ప్రమాదాలను అనుకోకుండా జరిగే ప్రమాదాలు కాబట్టి యాక్సిడెంట్ అంటాం. రోడ్డు ప్రమాదాల తరహాలోనే గుండెపోటు ప్రమాదాలు.. నాకు ఎటువంటి చెడు అలవాట్లు అంటే మద్యపానం, పానం వంటివి ఏవీ లేవని, నేను రోజు ఉదయం జాగింగ్‌కు వెళ్తానని లేదా వ్యవసాయం పనిలో ఎప్పుడు పని చేస్తూ ఉంటాను అని నేను మెకానిక్‌ను, హార్డ్ వర్కర్ ను, నేను ఎప్పుడూ ఏదో పని చేస్తుంటాను అంటూ ఇలా కొంత మంది ఏదో ఒక శరీరం దృఢపడే పనులు చేస్తూ ఉంటారు.ఈ పనులు చేసేవారు శరీరం దృఢపడడంతో పాటు అవయవాలు కూడా బాగానే ఉన్నాయని, నాకు ఎలాంటి అనారోగ్య పరిస్థితులు రావని, నా ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటున్నానని ధీమాతో బీమా వ్యక్తం చేసేవారు అధిక శాతం. పొద్దంతా పనిచేసి విశ్రాంతికి మందు తాగితేముంది.. పొద్దంతా పనులు చేస్తాం, వ్యవసాయ పనులు చేస్తాం, భవన నిర్మాణ పనులు చేస్తాం, బాడీ విశ్రాంతి ఉపశమనం కోసం కాయకష్టం చేసి కొద్దిగా మందు తాగితే ఏమవుతుంది? మేం చేసేది రెక్కలుముక్కలు చేసుకుని చేసే కష్టమే కదా మా శరీరానికి మందు తాగితే ఏమవుతుంది అన్న ధైర్యంతో సుమారు 70 శాతం మంది పట్టణ, పల్లెటూర్లలో వైన్స్ పర్మిట్ రూములలో పట్టనంత మంది రోజు వారు చేసిన కష్టంలో సగం మద్యం ఖర్చుకే పోతున్నాయి. వారు తాగే మద్యం నాణ్యమైన మద్యం కూడా కాదు. పక్క రాష్ట్రాల నుండి ప్రభుత్వాల అనుమతులు లేని చీప్ లిక్కర్, చౌకబారు మద్యంను సేవించే వారే ఈ కాయం కష్టం చేసే కూలీనాలీ జనాలు. ఈ వ్యసనం కొన్ని సంవత్సరాల తర్వాత నేరుగా ఊపిరితిత్తులు గాని, కిడ్నీలకు గాని, అన్నిటి కంటే ముఖ్యంగా గుండెకు కచ్చితంగా ఆటంకం కలిగిస్తుంది. అనారోగ్య ప్రమాదం ఏర్పడుతుంది.బీడీ, సిగరెట్ అలవాటు ఉన్న వారి సంగతి ఇక చెప్పనవసరం లేదు. పట్టణ ప్రాంతాలలో ప్రస్తుతం విద్యావంతుల కొంతమంది వైద్య రంగం, కొన్ని రంగాలలో పని చేసే వారికి ఈ అలవాట్లు లేకపోవచ్చు. కానీ, ఇతర కూలీనాలీ పని చేసే వారికి మాత్రం తప్పనిసరిగా ఈ ధూమపానం అలవాటు ఉంటుంది. పల్లెటూర్లలో చెప్పనవసరం లేదు, ధూమపానం అలవాటు ఉన్నవారు 70 శాతం పైగానే ఉంటారు. ఇంతకు ముందు పొగాకును వీక్లీ మార్కెట్లలో కిలోల కొద్దీ కొనుగోలు చేసి చుట్టలు తాగేవారు. ఇప్పటికీ తంబాకు చుట్టా తాగే వారు పల్లెటూర్లలో ఇంకా ఉన్నారు. ఇక ధూమపానంలో లేటెస్ట్‌గా సిగరెట్లలో రోజుకో మోడల్, రోజుకు ఫ్యాషన్ లైట్ సిగరెట్లు, స్మార్ట్ సిగరెట్లు అంటూ రకరకాలుగా, పుట్ట గొడుగుల్లా సిగరెట్ కంపెనీలు పుట్టుకొస్తూ కాలేజీలు, పాఠశాలలకు వెళ్లే యువకులను ఆకర్షించే విధంగా సిగిరెట్ పాకెట్లు వస్తున్నాయి. వీటిని నిషేధించే నాథుడే లేడు. కాలేజీకి వెళ్లే విద్యార్థి కూడా సిగరెట్లు తాగుతున్నాడు అంటే ధూమపానం ఏ స్థాయికి వెళ్లిందో ఆలోచించాలి.వెనుకటి నుండి పనులు చేస్తూ మధ్యలో విశ్రాంతికి దిగినప్పుడు ఒక బీడీ తాగే పల్లెటూరి వ్యక్తి ఇప్పుడు బీడీ కట్టలు కట్టలు తాగుతూ కొద్దిగా పదిమంది ఉన్నచోట హోటల్లో చాయ్ తాగి సిగరెట్ కూడా అలవాటు పడుతూ పల్లెటూర్లలో చెప్పలేని విధంగా ధూమపానం నూటికి నూరు శాతం పెరిగిపోయింది. ఇలా అధిక ఈ ధూమపానం వల్ల శరీరంలోని ఊపిరితిత్తులకు, ఇతర అవయవాలతో పాటు



ప్రధానంగా గుండెకు రక్తప్రసరణ చేసే రక్తనాళాలను మూసివేసే ప్రమాదం ఉందని డాక్టర్లు గట్టిగా నొప్పి చెపుతున్నారు. చెడు అలవాట్లు లేని వారు, ఆరోగ్యం పట్ల అప్రమత్తం అనేవారు మాకు ఎటువంటి ధూమపానం, వంటి చెడు అలవాట్లు లేవు, మేము చిన్న చిన్న చిట్కాలతో మా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ అప్రమత్తంగా ఉంటున్నాం. మాకు గుండెపోటు వంటి రోగాలు దరికి రావని ధీమాతో ప్రధానంగా పల్లెటూర్లలో జీవిస్తున్న వారు అధిక శాతం ఉన్నారు.చెడు అలవాట్లు లేవు కానీ శరీరంలో కొలెస్ట్రాల్‌పెంచే పదార్థాలను భుజిస్తూనే ఉన్నారు, మాంసాహారులైతే రకరకాల మాంసాహార బిర్యానీలకు అలవాటు పడి అదే పనిగా బొక్కలతో తయారైన మంచినూనెతో చేసిన బిరియానీలు తింటూ శరీరంలో కొవ్వును పెంచుకుంటున్నారు. శాకాహారులకు, మరి మాంసాహార వ్యక్తులకు శరీరంలో మాంసంతో కొవ్వు పెరుగుతుందని అనుకుంటే మరి అసలు మాంసం అలవాటు లేని శాకాహారులకు శరీరంలో కొవ్వు పెరగడంపై కొంత మంది ఆశ్చర్యపోతున్నారు. కొవ్వు కేవలం మాంసంలోనే ఉండదు. మాంసకృత్తులు ఉండే శాకాహారాలలో కూడా మాంసకృతులతో శరీరంలోని కొవ్వు పెరిగి గుండెపోటు ప్రమాదాల అంచులకు వెళ్తున్నారు. ఎన్ని చెడు అలవాట్లు ఉన్నా, చెడు అలవాట్లు లేకున్నా శరీరం, అవయవాలు ఆరోగ్యాల పట్ల అశ్రద్ధ వహిస్తే మృత్యువాత పడకతప్పవని డాక్టర్లు చెబుతున్నారు.ఎటు తిరిగి శరీరంలో కొవ్వును పెంచుకోకుండా జాగ్రత్తలు పాటిస్తే పని చేయని వారు రోజు జాగింగ్‌కు అలవాటైతే మన ఆరోగ్యాలను గుండె పోటు నుండి కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. క్షణం పాటు తీరని ఎవరు బిజీలో వారు, పక్కవారిని పలకరించడం కాదు కదా కుటుంబ సభ్యులతో సరిగా కలిసి జీవించలేని ఈ బిజీ బిజీ టెన్షన్ జీవనాలలో మన ఆరోగ్యాలను కాపాడుకోవడం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని వైద్యులు అంటున్నారు. గత పది సంవత్సరాల క్రితం గుండె పోటు మృతులు అంతగా ఉండేవి కావని, ఈ నాలుగైదు సంవత్సరాల నుండి గుండె పోటులతో అధిక శాతం మృత్యువాత పడుతున్నారని వైద్యులు అంటున్నారు. కరోనాకు ముందు గుండెపోటుతో తక్కువ మంది మృతి చెందేవారని, కరోనా అనంతరం గుండెపోట్లతో మృతుల సంఖ్య పెరిగిందని, సర్వత్రా వైద్య విశ్లేషకులు, మేధావులు అంటున్నారు. అందుకే ఆరోగ్యం కాపాడుకోవడంలో అధిక శ్రద్ధ వహిస్తూ జాగ్రత్తగా జీవనాలు గడపాలని, గుండెపోటు పట్ల తస్మాత్ జాగ్రత్త అని కొందరు హెచ్చరిస్తున్నారు.

## మరోమారు స్వల్పంగా పెరిగిన బంగారం ధర

హైదరాబాద్,ఆల్ టైమ్ రికార్డ్ స్థాయిల నుంచి క్రమంగా దిగి వస్తున్న బంగారం ధర శనివారం ట్రేడింగ్‌లో స్వల్పంగా పెరిగింది. దీపావళి తర్వాత బంగారం ధర భారీగా తగ్గిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా బంగారం ఔన్స్ ధర తగ్గడంతో దేశీయంగా కూడా పసిడి ధరలు క్రమంగా దిగివచ్చాయి. అయితే ట్రేడింగ్‌లో మాత్రం బంగారం స్వల్ప పెరుగులను నమోదు చేసిం ది.మధ్యాహ్నం 12 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 25, 620కి చేరింది.

# నగరమా.. నరకమా?



న్యూఢిల్లీ,దేశ రాజధానిలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400 దాటింది. ప్రపంచంలో నివాసయోగ్యం కాని నగరం ఏదైనా ఉన్నదా అంటే దానికి సమాధానం ఢిల్లీ అని చెప్పవచ్చు. తీవ్రస్థాయిలో విషపూరిత పొగమంచు దేశ రాజధాని ఢిల్లీ మొత్తాన్ని కమ్మేసింది. దీంతో ఊపిరి పీల్చుకోవడానికి ఢిల్లీ తల్లడిల్లిపోతోంది. దేశ రాజధాని నరకంలా మారింది. ఢిల్లీ వరుసగా మూడో రోజూ వాయు కాలుష్యం అతి తీవ్రస్థాయిలోనే ఉంది. ఇవాళ వాయు నాణ్యత సూచీ 402 కి చేరింది. జహంగీర్‌పురి ప్రాంతంలో ఈ సూచీ 506, సోనియా విహార్‌లో 462 కి పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మితిమీరిన కాలుష్యంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దేశ రాజధాని నగరాన్ని నరకంగా మార్చేసిన వాయు కాలుష్యం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. కాలుష్య తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఢిల్లీలో పలు ఆంక్షలు అమలు చేస్తున్నారు. నిర్మాణ పనులపై ఆంక్షలు విధించారు. లైట్ కమర్షియల్ వాహనాలు, డీజిల్‌ట్రక్కుల రాకపోకలను నిషేధించారు. భవన నిర్మాణ పనులను, కూల్చివేతలను నిషేధిస్తున్నట్లు ఢిల్లీ పర్యావరణ శాఖ ప్రకటించింది. కాలుష్యం కేవలం ఢిల్లీకే పరిమితం కావడం లేదు. రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్, గ్రేటర్ నోయిడా తదితర ప్రాంతాల్లోనూ వాయు నాణ్యత దిగజారింది.ఢిల్లీలో విష వాయువుల గాఢత ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిమితుల కంటే 50 రెట్లు ఎక్కువగా ఉండడంతో వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం కారణంగా ఢిల్లీలో దగ్గు, జలుబు, గొంతు ఇన్ఫెక్షన్లు, కంటి దురదతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ సీజన్‌లో ఇలా కాలుష్య తీవ్రత పెరగడం ఇదే తొలిసారి. దీంతో ఢిల్లీ– ఎన్‌సిఆర్ ప్రాంతాన్ని అతి తీవ్ర కాలుష్య జోన్‌గా గుర్తించారు. రెండు వారాల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. గత దశాబ్ది కాలంగా ఇదే పరిస్థితి. ఢిల్లీ, యుపి, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో పంటలను తగులపెట్టడం వల్ల, అలాగే పరిశ్రమల నుండి వెలువడుతున్న విష వాయువుల వల్ల విపరీతమైన దుస్థితి ఏర్పడింది. ఈ పాపం నాది కాదు అంటే నాది కాదని రాష్ట్రాలు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఢిల్లీలో ప్రమాద ఘంటికలు మోగిస్తోన్న వాయు కాలుష్యం సోమవారం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 402, అలాగే రెస్పిరబుల్ పార్టీకు లెట్ మ్యాటర్ 380, నైట్రోజెన్ దయాక్సయిడ్ 32, సల్ఫర్ దయాక్సయిడ్ 13, ఓజోన్ 68, కార్బన్ మోనాక్సయిడ్ 21 గా ఉంది. గాలి నాణ్యత క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రజలు ముఖ్యంగా వయోజనులు, పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. శ్వాసకోశ సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఢిల్లీ సహా పరిసర ప్రాంత ప్రజలు గడపదాటి బయటకు రావాలంటే మాస్కు ధరించక తప్పని పరిస్థితి నెలకొంది. కోరలు చాచిన వాయు కాలుష్యం ఈదుస్థితిని తీసుకొచ్చింది. చలికాలం వచ్చిందంటే చాలు ఢిల్లీలో పీల్చే గాలి విషంగా మారుతున్నది. రుతుపవనాల తిరోగమనం అనంతరం ఉత్తరాదిన ఏర్పడే ప్రత్యేక వాతావరణ పరిస్థితులు ఒక కారణమైతే, మానవ తప్పిదాలు ఈ వాయు కాలుష్యం స్థాయిలను మరింత పెంచి పీల్చే గాలిని విషతుల్యం చేస్తున్నాయి. ఢిల్లీ నగరంలోని వాహన ఉద్గారాలు తోడు పొరుగు రాష్ట్రాలు పంజాబ్, హర్యానా రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వల్ల ఏర్పడే పొగ శీతాకాలంలో సహజ సిద్ధంగా ఏర్పడే పొగమంచులో కలిసిపోయి ఊపిరి పీల్చుకోలేని ఉక్కిరిబిక్కిరి పరిస్థితి సృష్టిస్తున్నాయి. భవన నిర్మాణ పనుల కారణంగా ఏర్పడే దుమ్ము, ధూళి అన్నీ కలగలిపి గాలి నాణ్యతను దారుణంగా దెబ్బ తీస్తున్నాయి.పొల్యూషన్ మానిటరింగ్ మెకానిజం లేక ప్రజలకు కాలుష్యం దుష్ప్రభావాలు తెలియక తీవ్ర సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న పారిశ్రామిక సాంకేతిక విధానాలు ప్రకృతి విధ్వంసానికి కారణాలు అవుతున్నాయి. ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డయాక్సైడ్, ఆర్గాన్, నీటి ఆవిరి సమతుల్యంగా ఉంటేనే వన్యప్రాణి, వ్యవసాయానికి, మానవుని అభివృద్ధికి తోడ్పడుతుంది. వాయువులు, కణాలు, జీవ అణువులతో సహా హానికరమైన లేదా అధిక పరిమాణంలో ఉన్న పదార్థాలను భూమి వాతావరణంలోకి ప్రవేశపెట్టినప్పుడు వాయు కాలుష్యం సంభవిస్తుంది. ఇది మానవులకు వ్యాధులు, అలెర్జీలు, మరణానికి కారణం కావచ్చు. ఇది జంతువులు, ఆహార పంటలు వంటి ఇతర జీవులకు కూడా హాని కలిగించవచ్చు. సహజమైన లేదా నిర్మించిన వాతావరణాన్ని దెబ్బతీస్తుంది. మానవ కార్యకలాపాలు, సహజ ప్రక్రియలు రెండూ వాయు కాలుష్యాన్ని సృష్టించగలవు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, వాయు కాలుష్యం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఏటా 8 మిలియన్ల మంది మరణాలకు కారణమైంది.పరిశ్రమలు, రవాణా మొదలైన ప్రజల కార్యకలాపాల ద్వారా తయారైన విష పదార్థాలు సమాజాన్ని చుట్టే గాలిని కలుషితం చేస్తాయి. ప్రధాన కాలుష్య కారకాలు దహన, చెత్తను తగులబెట్టినప్పుడు రసాయన ప్రతిచర్యల వల్ల దుమ్ము, మసి, ఆటోమొబైల్ పెట్రోలియం వాహనాల ద్వారా ఎగ్జాస్ట్ గ్యాస్ వంటి సల్ఫరస్ వాయువులో ఉండే నత్రజని ఆక్సైడ్లు, కాలుష్యం ప్రజల ఆరోగ్యాన్ని, ఆస్తిని, జంతువులు, మొక్కలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. సహజ పరిస్థితులు, క్షీణత, శ్వాసకోశ వ్యాధులు, శ్వాసనాళ ఆస్తమా వంటి వివిధ వ్యాధుల ప్రేరణ. వాయు కాలుష్యం తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలకు కారణమయ్యే పిఎం 2.5, పిఎం 0.5 వంటి చక్కటి రేణువుల హానికరమైన పదార్థాలను కలిగి ఉంది. ఎసిలు, రిఫ్రిజిరేటర్లు విపరీతంగా వాడడం వలన క్లోరోఫ్లోరో కార్బన్లు, ద్రావకాలు, రిఫ్రిజిరేటర్లకు ఉపయోగించే వాయువుల ద్వారా ఓజోన్ పొరను నాశనం చేసి వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ వాయువు సాంద్రత పెరగడం వల్ల గ్రీన్‌హౌస్ ప్రభావం వాతావరణంలో పర్యావరణ విధ్వంసం సమస్యగా దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

## అమరులకు..ఉద్యమకారులకు తీరని అన్యాయం

హైదరాబాద్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి లోనయ్యారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అమరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యమకారుల కోసం పోరాడలేకపోయామని, అమరవీరుల కుటుంబాలకు అనుకున్నంత న్యాయం చేయలేకపోయామని భావోద్వేగానికి లోనయ్యారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేవరకు పోరాడనందుకు బహిరంగ క్షమాపణ చెప్పారు. కాగా, కవిత శనివారం నుంచి 'జాగృతి జనం బాట' కార్యక్రమం నిర్వహించనున్నారు. వరుసగా 4 నెలలపాటు ప్రజలతో ఉండేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. నిజామాబాద్ నుంచి జనంబాట కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రజలు కోరుకుంటే కొత్త పార్టీని పెట్టేందుకు కూడా సిద్ధమని కవిత ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలో కవిత శనివారం 'జాగృతి జనం బాట' పేరుతో రాష్ట్రవ్యాప్త పర్యటనను ప్రారంభించారు. ఈ యాత్రకు ముందుగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, అనంతరం మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో అమరవీరుల కుటుంబాలకు, తెలంగాణ ఉద్యమకారులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయామని అంగీకరిస్తూ, వారికి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం కోసం 1,200 మంది ప్రాణ త్యాగం చేశారని, కానీ అధికారంలోకి వచ్చాక వారి కుటుంబాలకు అనుకున్నంత మేర న్యాయం చేయలేకపోయామని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 500 మంది అమరవీరుల కుటుంబాలకు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వగలిగాం. ఉద్యమకారులకు కొన్నిచోట్ల రాజకీయంగా నామమాత్రపు పదవులు దక్కాయి కానీ, వారికి జరగాల్సినంత న్యాయం జరగలేదు. ఎంపిగా ఉన్నప్పుడు పార్టీ అంతర్గత వేదికలపై ఈ విషయం ప్రస్తావించినా,వారికోసం గట్టిగా కొట్లాడలేక పోయాను. అందుకే ఇప్పుడు బహిరంగంగా క్షమాపణ చెబుతున్నానని కవిత అన్నారు. అమరవీరుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వకపోతే రాబోయే ప్రభుత్వంతోనైనా ఇప్పించి తీరుతామని ఆమె హామీ ఇచ్చారు. 'సామాజిక తెలంగాణ' సాధనే లక్ష్యంగా తాను 33 జిల్లాలు, 119 నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నానని? సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కే వరకు తన పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. ' తెలంగాణ తల్లి విగ్రహం చేతిలోంచి బతుకమ్మను తీసేశారు. తిరిగి తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను పెట్టే వరకు పోరాడదాం 'అని పిలుపునిచ్చారు. పాత మనస్పర్థలను పక్కనపెట్టి జాగృతి మాజీ సభ్యులందరూ తిరిగి కలిసి రావా లని,సామాజిక తెలంగాణ కోసం ఐక్యంగా పోరాడాలని కవిత పిలుపుని చ్చారు.

## ఇంటర్ విద్యావిధానంలో మార్పులు

హైదరాబాద్, తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది. 2026 ఫిబ్రవరి 25 వ తేదీ నుంచి మార్చి 18 వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలను ఆయన మీడియాకు తెలిపారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో కూడా ల్యాబ్స్, ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఉంటాయని, ఇంగ్లీష్‌లో ఉన్నట్లుగానే మిగతా భాషల్లోనూ ప్రాక్టికల్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. 12 ఏళ్ల తర్వాత ఇంటర్ సిలబస్‌లో మార్పులు జరగబోతున్నట్లు తెలిపారు. మ్యాథ్స్, ఫిజిక్స్ , కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సిలబస్ మారబోతున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ విద్యా విధానంలో మార్పులతో పాటు పరీక్షల తేదీలను ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య విడుదల చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో కూడా ల్యాబ్స్ , ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉంటాయి.. అలాగే, ఇంటర్ సిలబస్ లోనూ మార్పులు చేసినట్లు ప్రకటించారు. 12 సంవత్సరాల తర్వాత మ్యాథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బొటనీ, జువాలాజీలో సిలబస్ లో మార్పులు జరిగాయని ప్రకటించారు. హ్యూమానిటీస్ సబ్జెక్టుల్లో యాక్టివిటీ బేస్డ్ సిలబస్ ఏప్రిల్ మొదటి వారంలో బుక్స్ అందుబాటులోకి వస్తాయని ఇంటర్ బోర్డు సెక్రటరీ వెల్లడించారు. అలాగే, కొత్త కోర్స్ కోర్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య చెప్పుకొచ్చారు. ఇంగ్లీష్ లో ఉన్నట్టు గానే మిగతా లాంగ్వేజెస్ లోనూ ప్రాక్టికల్స్ ఉంటాయి. ఇకపై 80 మార్కులు ఎక్స్‌టర్నల్, 20 మార్కులు ఇంటర్నల్ మార్కులుగా ఉంటాయన్నారు. ల్యాబ్ ప్రాక్టికల్స్ ప్రతి సంవత్సరం 15 మార్కుల చొప్పున నిర్వహించనున్నారు. అంతేకాకుండా, ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య తెలిపారు.


## వైద్యురాలి ఆత్మహత్యపై దర్యాప్తు

ముంబై,మహారాష్ట్రలో ఓ మహిళా వైద్యురాలి (26) ఆత్మహత్య సంచలనంగా మారింది. సతారా జిల్లా ఆస్పత్రిలోనే వైద్యురాలు ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు ముందు నాలుగు పేజీల సూసైడ్ నోట్ రాసిపెట్టింది. ఎస్ఐ గోపాల్ బద్నే తనను శారీరకంగా, మానసికంగా వేధించాడని ఆరోపించింది. ఐదు నెలల్లో పలుమార్లు తనపై అత్యాచారం చేశాడని ఆరోపించింది. అతడి వేధింపుల వల్లే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలిపింది. పై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితురాలు వాపోయింది. ఇక సూసైడ్ నోట్‌లో అనేక సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఓ ఎంపీ, అతడి సహాయకుల నుంచి తీవ్రమైన బెదిరింపులు వచ్చాయని ఆరోపించింది. ఇక వైద్య పరీక్షలకు తీసుకురాకుండానే నిందితులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలంటూ పోలీసులు పదేపదే తనపై ఒత్తిడి తెచ్చారని తెలిపింది. అందుకు నిరాకరించడంతో ఎస్ఐ గోపాల్ బద్నేతో పాటు మరికొందరు పోలీసు అధికారులు తనను వేధింపులకు గురిచేశారని ఆరోపించింది. ఇక ఎస్ఐ గోపాల్ బద్నే తనపై ఐదు నెలలుగా అత్యాచారం చేస్తున్నాడని.. పైగా మానసికంగా, శారీరకంగా హింసించాడని వాపోయింది. ఇంటి యజమాని కుమారుడు ప్రశాంత్ బంకర్‌పై కూడా ఇవే రకమైన ఆరోపణలు వైద్యురాలు చేసింది. సూసైడ్ నోట్ ఆధారంగా ఎస్ఐ గోపాల్ బద్నే, ఇంటి యజమాని కుమారుడు ప్రశాంత్ బంకర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే విచారణలో ఎస్ఐ గోపాల్ బద్నే–వైద్యురాలు బంధువులేనని తేలింది. బంధువు ముసుగులో ఎస్ఐ.. వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడినట్లు గుర్తించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం పొలిటికల్ టర్న్ తీసుకుంది. బీజేపీ కూటమి ప్రభుత్వం నిందితులను కాపాడుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నామ్‌దేవ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో కీలక పోస్టు పెట్టారు. రక్షించాల్సి పోలీసులే.. వైద్యురాలిపై వేధింపులకు పాల్పడటాన్ని తప్పుబట్టారు. తొలుత ఆమె పై అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడే ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం పదేపదే పోలీసులను రక్షిస్తోందని.అందుకే దురాగతాలు పెరిగిపోయాయని విమర్శించారు. ఆరోపణలను బీజేపీ నాయకురాలు చిత్ర వాఘ్ ఖండించారు. ఇది సంఘటన దురదృష్టకరమని, ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుపుతామని హామీ ఇచ్చారు.

## నార్సింగ్‌లో హిట్ అండ్ రన్ కేసు

హైదరాబాద్,హైదరాబాద్ నార్సింగి పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హైదర్ షాకోట్ చౌరస్తా దగ్గర జరిగిన ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే, హైదర్ షాకోట్ ప్రాంతానికి చెందిన కృష్ణ అనే వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొట్టింది.

# చంద్రబాబుపై రిటైర్డ్ ఐఏఎస్ సంచలన వ్యాఖ్యలు..



అమరావతి,ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరుపై రిటైర్డ్ ఐఏఎస్, కేంద్ర ప్రభుత్వంలో ఆర్థికశాఖ డైరెక్టరుగా పనిచేసిన సుభాష్ చంద్ర గార్గ్ సంచలన విషయాలను వెల్లడించారు. 1999-2004 మధ్య కేంద్ర ప్రభుత్వంలో పనిచేసిన సుభాష్ చంద్ర గార్గ్ ఆ తర్వాత రిటైర్ అయ్యారు. తాజాగా ఆయన 'నో మినిస్టర్' అనే పేరుతో తన ఆత్మకథను రాశారు. త్వరలో విడుదల కానున్న ఈ పుస్తకంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఓ చాప్టర్ రాశారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వంలో విపరీతమైన పలుకుబడి, జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసిన కింగ్ మేకర్ గా చంద్రబాబు తన రాష్ట్రం ప్రయోజనాల కోసం ఎంతలా పనిచేసేవారో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. తన ఆత్మకథలో ఇతర రాష్ట్రాల దృక్కోణంలో చంద్రబాబుపై విమర్శలు చేసినా ఉమ్మడి రాష్ట్రం, తెలుగు ప్రజల ప్రయోజనాల కోసం చంద్రబాబు ఎంతలా పరితపించిపోయేవారనేది ఆ చాప్టర్ లో స్పష్టంగా తెలియజేశారు.సుభాష్ చంద్ర గార్గ్ ఆర్థిక శాఖలోని ఎకనామిక్ అఫైర్స్ చూసేవారు. అప్పట్లో ప్రధానిగా వాజపేయి ఉండగా, చంద్రబాబు మద్దతుతో ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగేది. అయితే చంద్రబాబు దేశంలో మిగతా రాష్ట్రాల ప్రయోజనాలను పట్టించుకోకుండా, కేవలం తన రాష్ట్రం కోసమే కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి గరిష్ట ప్రయోజనం పొందేవారని సుభాష్ చంద్రగార్గ్ తన ఆత్మకథలో వివరించారు. పలు ఉదాహరణలతో చంద్రబాబు పనితీరును వర్ణించిన ఆయన తాను డైరెక్టరుగా పనిచేయగా, ఏపీ ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదనలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని అడ్డు చెప్పేవాడనని, కానీ, చంద్రబాబు అప్పటి ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తీసుకువచ్చి తాను అనుకున్న పని చేయించుకునేవారని ఆయన వివరించారు. ఈ సందర్భంగానే చంద్రబాబు తాను అనుకున్నది సాధించుకునేందుకు 'తన రక్తం కళ్ల చూసేలా వెంటపడేవారని' వ్యాఖ్యానించారు. ఒక సమయంలో చంద్రబాబు ప్రమేయంతో ప్రపంచ బ్యాంకు నుంచి వంద శాతం రుణం తీసుకుని గ్రాంటుగా మార్చుకున్నారని ఉదాహరణలతో సహా వెల్లడించారు. చంద్రబాబు హయాంలోనే తొలిసారిగా ప్రపంచ బ్యాంకు రాష్ట్రాలకు అప్పులిచ్చే విధానం మొదలైందని కూడా ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ బ్యాంకు నుంచి మొత్తం రుణం గ్రాంటుగా తీసుకుంటే దేశంలో మిగతా రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని తాను అడ్డు పడితే, అప్పటి కేంద్ర ఆర్థిక శాఖ సెక్రటరీ వద్దకు ఫైల్ తెప్పించుకుని, ఆర్థిక మంత్రి జశ్వంత్ సింగ్ ద్వారా ఆ ఫైల్ ను ఆమోదించుకున్నారని సుభాష్ చంద్ర గార్గ్ వెల్లడించారు. ఈ క్రమంలోనే చంద్రబాబుపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు సుభాష్ చంద్ర గార్గ్. 'చంద్రబాబు తన రాష్ట్రం కోసం ఏమైనా చేస్తారని.. 1999-2004 మధ్య దేశంలో మిగతా రాష్ట్రాలతో పోల్చుకుంటే ఏపీకే ఎక్కువ మేలు జరిగిందని ఆయన వివరించారు. ఇదే సమయంలో చంద్రబాబు ప్రవర్తనను 'ఉన్మాదంతో కూడిన ఉత్సాహం'గా ఆయన ప్రస్తావించడం విశేషంగా చెబుతున్నారు. సుభాష్ చంద్ర మాటల్లో చంద్రబాబు పూర్తిగా తన రాష్ట్ర ప్రయోజనం కోసమే పనిచేస్తారని, మిగతా రాష్ట్రాలను ఆయన ఏ మాత్రం పట్టించుకోరని నిష్టూరమాడారు. ఓ కేంద్ర ప్రభుత్వ అధికారి తన అనుభవాలతో రాసిన ఆత్మకథలో చంద్రబాబు కోసమే ప్రత్యేకంగా ఓ చాప్టర్ కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. అప్పట్లో కింగ్ మేకర్ గా ఉన్న చంద్రబాబు ఏ స్థాయిలో పనిచేసేవారో సుభాష్ చంద్ర గార్గ్ ఆత్మకథ చెబుతోందని టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

# బిహార్ పోల్: త్రిముఖ పోరులో ఏ పార్టీ ఏ కూటమిలో?

బిహార్,ఎవరు అవునన్నా.. కాదన్నా.. కొన్ని కీలక రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలు.. వాటి ఫలితాలు దేశ రాజకీయ గమనాన్ని ఇట్టే మార్చేస్తుంటాయి. అందుకు బోలెడన్ని ఉదాహరణలు ఉన్నాయి. ప్రస్తుతం బిహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఆ కోవకు చెందినదే. డెవలప్ మెంట్ లో వెనుకబడినప్పటికి.. గడిచిన పదేళ్లలో ఆ రాష్ట్ర రూపురేఖలు చాలానే మారాయి. ఈసారి ఎన్నికల్లో ఎలా అయినా విజయాన్ని సొంతం చేసుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) భావిస్తోంది. అదేసమయంలో మహాగఠ్ బంధన్ లోని కీలకమైన ఆర్జేడీ.. కాంగ్రెస్ తో జత కట్టి అధికారాన్ని సొంతం చేసుకోవాలని తపిస్తోంది. ఇప్పుడు కాకుంటే మరెప్పటికీ కాదన్నట్లుగా వ్యవహరిస్తోంది. ఇలా ఓవైపు ఎన్డీయే.. మరోవైపు మహాగఠ్ బంధన్ కూటమిలతో పాటు.. మరో కీలకమైన కూటమి ఉంది. అదే భారతీయ ఎన్నికల సిత్రాన్ని సమూలంగా మార్చేసి.. పార్టీలకు వ్యూహాల్ని అందించే కార్పొరేట్ విధానాన్ని తెర మీదకు తీసుకొచ్చిన ప్రశాంత్ కిశోర్ తన సొంత రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఏర్పాటు చేసిన పార్టీతో పాటు..లాలూ కొడుకు ఏర్పాటు చేసిన పార్టీతో జత కట్టి ఎన్నికల బరిలోకి దిగారు. కీలక విజయాన్ని సొంతం చేసుకోవాలన్న తపనలో ఉన్నారు. ఇప్పటికే పలువురు ముఖ్యమంత్రుల్ని తయారు చేసిన ఫ్యాక్టరీగా ఆయనకు పేరుప్రఖ్యాతులు ఉన్నప్పటికి.. సొంత రాష్ట్రంలో ఆయన తన సత్తా ఎంతమేర చాటతారన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. హోరాహోరీగా సాగుతున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ కూటమి తరపున ఏ పార్టీ ఎన్నికల బరిలోకి దిగుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో కొంత కన్ఫ్యూజన్ నెలకొంది. ఈ నేపథ్యంలో ఫుల్ క్లారిటీ ఇచ్చేస్తున్నాం.బిహార్ అసెంబ్లీలో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మొత్తం 38 జిల్లాల్లో ఉండే బిహార్ రాష్ట్రాన్ని మరోలా కూడా చెప్పొచ్చు. ఏపీని ఏ విధంగా అయితే కోస్తా, రాయలసీమ, గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్రగా పేర్కొంటారో.. అదే రీతిలో బిహార్ రాష్ట్రాన్ని చెప్పాలంటే.. మిథిల.. భోజ్ పూర్.. మగధ.. కోసి ప్రాంతంగా చెప్పొచ్చు.మిథిల ప్రాంతం.. బిహార్ ఈశాన్య భాగంలో.. నేపాల్ సరిహద్దులో ఉంటుంది. భోజ్ పూర్ ప్రాంతం విషయానికి వస్తే.. నూరుతి భాగాన్ని ఇలా వ్యవహరిస్తారు.



మగధ ప్రాంతం బిహార్ దక్షిణ భాగంలో ఉంటుంది. దీని పరిధిలోనే రాష్ట్ర రాజధాని పాట్నాతో పాటు గయ లాంటి ప్రధాన నగరాలు ఉంటాయి.కోసి ప్రాంతం రాష్ట్రంలోని తూర్పు భాగంలో ఉంటుంది. శ్రీనివాసపుర ప్రాంతం పశ్చిమ భాగంలో ఉంటుంది. త్రిముఖ పోరులో ఏ కూటమిలో ఏ పార్టీలు ఉన్నాయన్న విషయానికి వస్తే..

-ఎన్డీయే కూటమి,బీజేపీజి,జేడీయూజి,లోక్ జనశక్తి (రాంవిలాస్),హిందుస్థాన్ అవామ్ మోర్చా,రాష్ట్రీయ లోక్ మంచ్,మహాగఠ్ బంధన్,ఆర్జేడీ,కాంగ్రెస్,వికాస్ శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ0,వామపక్ష పార్టీలు,మూడో కూటమి,జన్ సురాజ్ పార్టీ ,(ప్రశాంత్ కిశోర్ పార్టీ),జన్ శక్తి జనతాదళ్ (జేజేడీ)

ఇక సీట్ల పర్దుబాటు విషయానికి వస్తే.. ఎన్డీయే కూటమిలో కీలక బీజేపీ.. జేడీయూ విషయానికి వస్తే ఈ రెండు ప్రధాన పార్టీలు 101 సీట్ల చొప్పున సర్దుబాటు చేసుకోగా.. ఎల్జేపీ 29 స్థానాలతో, రాష్ట్రీయ లోక్ మంచ్ 6 స్థానాల్లో.. హిందుస్థాన్ అవామ్ మోర్చా ఆరు స్థానాల్లో బరిలోకి దిగనుంది. మహాగఠ్ బంధన్ కూటమి విషయానికి వస్తే.. సీట్ల సర్దుబాటు పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ కూటమిలో కీలకమైన ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు చాలాచోట్ల స్నేహపూర్వక పోటీలో ఉన్నారు. ఆర్జేడీ 143 స్థానాల్లో.. కాంగ్రెస్ అధికారికంగా 61 సీట్లలో.. వీఐపీ 15 చోటల పోటీ చేస్తున్నాయి. అనధికారికంగా మరికొన్ని స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తోంది.

# చాన్స్ కొడితే లాలూ ఫ్యామిలీలో అంతా ముఖ్యమంత్రులే !

న్యూఢిల్లీ,ప్రజాస్వామ్యం అంటే నిరంతరం మార్పు కోసం ఉన్నదని అర్థం. ఏ పరిపాలకుడికి అయినా అయిదేళ్ళే ప్రజలు అవకాశం ఇస్తారు. అంతే కాదు ఎంత బాగా పాలించినా ఇంకా మంచి పాలకుడి కోసం ప్రజలు అన్వేషిస్తారు. ఆ స్వేచ్చ అధికారం ఓటరుకు ప్రజాస్వామ్యం ఇచ్చింది. అంతే అందుకే ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు అని అంటారు. అదే రాజరిక వ్యవస్థలో అయితే వరసగా కుటుంబాలకు కుటుంబాలు అధికారం అందుకుంటూ కొనసాగుతాయి. అయితే భారతదేశం ప్రజాస్వామ్యంలో కూడా చాలా మంది నాయకులు తమ కుటుంబ వారసులను తెచ్చి అందలాలు ఎక్కించారు. జనాలు కూడా వాటికి ఆమోదించారు.

గాంధీ కుటుంబంలో :

ఈ వారసత్వ రాజకీయాలకు అంకురార్పణ గాంధీ కుటుంబంలోనే మొదలైంది అని చెప్పాలి. పండిట్ నెహ్రూ దేశానికి తొలి ప్రధాని అయ్యారు. ఆయన తరువాత కుమార్తె శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధాని అయ్యారు. ఆ తరువాత మనవడు రాజీవ్ గాంధీ ప్రధాని అయ్యారు. ఆ విధంగా చూస్తే ఒకే కుటుంబంలో మూడు తరాలు దేశానికి నాయకత్వం వహించడం అరుదైన విషయం. ఇక రాహుల్ గాంధీ కూడా ప్రధాని అయితే పండిట్ నెహ్రూ నుంచి నాలుగు తరాలు అత్యున్నత పదవిని అందుకున్నట్లు. ఆ అరుదైన రికార్డు సాధ్యమవుతుందో లేదో తరువాత చూడాలి. అయితే దేశంలో చాలా మంది ముఖ్యమంత్రులుగా ఉంటూ తమ వారసులను ఆ పదవిలో అధిష్టింప చేశారు.

లాలూ ఫ్యామిలీలో :

ఇక బీహార్ లో లాలూ ఫ్యామిలీలో ఒక అరుదైన ఘటన జరిగింది. 1989లో లాలూ తొలిసారి బీహార్ కి సీఎం అయ్యారు. ఆయన చాలా కాలం పాలించారు. అయితే గడ్డి కుంభకోణం కేసులో ఆయన అరెస్టు కావడంతో తన సతీమణిని సీఎం గా చేసి అప్పట్లోనే అందరినీ ఆశ్చర్యపరచారు. ఇది మూడు దశాబ్దాల క్రితం జరిగింది. అలా రబ్రీదేవి సీఎం అయ్యారు. ఆమె ఏమి పాలిస్తారు అనుకునే వారే ఆశ్చర్యపోయేలా భర్త లాలూ కంటే కూడా ఎక్కువ కాలం అంటే దాదాపుగా పదేళ్ళ పాటు పాలించారు. ఇలా భార్యభర్తలు ఇద్దరూ బీహార్ అత్యధిక కాలం పాలించారు.

వారసుడిగా తేజస్వి :



ఇక లాలూ తరువాత ఆయన చిన్న కుమారుడు తేజస్వి యాదవ్ ఆర్జేడీకి వారసుడిగా సిద్ధం అయ్యారు. తేజస్వి యాదవ్ తండ్రికి తగ్గ తనయుడిగా రాణిస్తున్నారు. ఆయన ఇప్పటికే ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. ఇక మిగిలింది ముఖ్యమంత్రి పదవి మాత్రమే. తాజాగా చూస్తే మహా ఘట్ బంధన్ తేజస్వి యాదవ్ ని సీఎం అభ్యర్థిగా ప్రకటించింది. దాంతో ఈ మహా ఘట్ బంధన్ కనుక బీహార్ ఎన్నికల్లో విజయం సాధిస్తే కచ్చితంగా తేజస్వి యాదవ్ సీఎం అవుతారు.

అరుదైన రికార్డుగా :

ఈ విధంగా కనుక తేజస్వి యాదవ్ సీఎం అయితే మాత్రం ఒక అరుదైన రికార్డు దేశ రాజకీయాల్లో స్థాపించబడుతుంది. ఒకే కుటుంబంలో తల్లిదండ్రులు కుమారుడూ ముగ్గురూ సీఎం గా పనిచేసిన ఘనత కూడా లాలూ కుటుంబానికే దక్కుతుంది. లాలూ ఫ్యామిలీ అంటే ముఖ్యమంత్రుల కుటుంబం అని కూడా సార్థక నామధేయం స్థిరపడుతుంది. గాంధీల ఫ్యామిలీ అంటే ప్రధానుల కుటుంబం అని ఎలా చెప్పుకుంటారో అలాగే లాలూ ఫ్యామిలీ కొత్త రికార్డుకు రెడీ అవుతోంది అన్న మాట. ఇక్కడ మరో విషయం ఉంది. తేజస్వికి ఒక కుమారుడు ఉన్నారు. అతని పేరు కూడా లాలూ యాదవ్. మరి రానున్న కాలంలో ఆ వారసుడు కూడా రంగంలోకి దిగితే మాత్రం లాలూ సకుటుంబ సపరివార సమేతంగా చీఫ్ మినిస్టర్లు కిందనే లెక్క అని అంటున్నారు. చూడాలి మరి ఈసారి బీహార్ ఎన్నికల్లో ఏ రిజల్ట్ వస్తుందో.

# జూబ్లీహిల్స్ పోరులో ఎంతమంది ఉన్నా.. ఆ ఇద్దరి మధ్యే పోటీ...?



హైదరాబాద్ తెలంగాణ రాజధాని గ్రేటర్ హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నిక నామినేషన్ల పర్వం ముగిసింది. ఇప్పుడు అందరూ ప్రచారం మీద దృష్టి సారిస్తున్నారు. మొత్తం 81 నామినేషన్లు దాఖలు కాగా.. ఇందులో చాలా నామినేషన్లు తిరస్కరణకు గురైనట్టు తెలుస్తోంది. ఎంతమంది అభ్యర్థులు నామినేషన్లు వేసినా ప్రధాన పోటీ అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ అటు బిజెపి అభ్యర్థుల మధ్య ఉంటుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే వాస్తవంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రస్తుత వాతావరణం ఎలా ఉంది పోటీ ఎవరెవరి మధ్య ఉంది ? అన్నది పరిశీలిస్తే ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి. వాస్తవ పోటీ మాత్రం బిఆర్ఎస్ - కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య ఉంటుందని క్లియర్ గా తెలుస్తోంది.జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ పార్టీకి సిట్టింగ్ సీటు. ఇక్కడి నుంచి గత మూడు ఎన్నికలలో దివంగత మాగంటి గోపీనాథ్ వరుస విజయాలు సాధిస్తూ వచ్చారు. 2014లో తెలుగుదేశం నుంచి తొలిసారిగా ఇక్కడ ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత రెండు ఎన్నికలలోను గులాబీ పార్టీ గుర్తు మీద విజయం సాధించారు. ఇప్పుడు ఉప ఎన్నికలలో సానుభూతి కోసం గులాబీ పార్టీ గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతను పోటీ చేయిస్తుంది. ఈ విషయంలో కొందరు నేతలు రేసులో ఉన్నా గులాబీ అధినేత ఎలాంటి రిస్క్ తీసుకోలేదు. ఇక కాంగ్రెస్ పార్టీ ఈ ఉప ఎన్నికను తమకు వచ్చిన మరో మంచి అవకాశంగా చూస్తోంది. సాధారణ ఎన్నికల తర్వాత ఆరు నెలలకే కంటోన్మెంట్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. అది కూడా బిఆర్ఎస్ పార్టీకి సిట్టింగ్ సీటు. మరోసారి బిఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ సీటు అయిన జూబ్లీహిల్స్ ని కూడా తమ ఖాతాలో వేసుకునేందుకు సకల అస్త్ర శాస్త్రాలు వాడుతుంది.ఈ సారి ఈ నియోజకవర్గంలో మంచి పట్టున్న మజ్లిస్ పార్టీ మద్దతు కూడా కాంగ్రెస్‌కు తోడైంది. దీనికి తోడు నవీన్ యాదవ్ వ్యక్తిగత ఛరిష్మా, రేవంత్ రెడ్డి గట్టి ఫోకస్ పెట్టడం ఇవన్నీ కాంగ్రెస్‌కు ప్లస్‌గా మారాయి. ఇక కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగడం, కేటీఆర్, హరీష్‌రావు ఇక్కడ ఉప ఎన్నిక ఇన్‌చార్జ్‌లుగా ఉండడం బీఆర్ఎస్‌కు కలిసి రానుంది. అయితే బీజేపీ ఈ ఉప ఎన్నికను ముందు నుంచి ఏ మాత్రం సీరియస్‌గా తీసుకోలేదని తెలుస్తోంది. అసలు అభ్యర్థిని సైతం చాలా ఆలస్యంగా ఖరారు చేసింది. మైనార్టీ ఓట్ల సెంట్రలైజేషన్ కూడా బీజేపీకి మైనస్. గత ఎన్నికల్లో ఓడిపోయిన దీపక్ రెడ్డికి సీటు ఇచ్చినా.. ఆయన అంత ఆసక్తితో ఉన్నట్టు కనపడడం లేదు. ఏదేమైనా జూబ్లీహిల్స్ పోరు కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్యే అన్నది సుస్పష్టం.

# లిక్కర్ కేసులో నిందితులకు మళ్లీ షాక్.. ఏమైందంటే...?



ఏపీ లిక్కర్ స్కాంలో రిమాండులో ఉన్న ఏడుగురు నిందితులకు ఏసీబీ కోర్టు షాకిచ్చింది. రెగ్యులర్ బెయిలు కోసం నిందితులు వేసిన పిటిషన్ ను తిరస్కరించింది. అంతేకాకుండా వచ్చేనెల 7వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బెయిలు వస్తుందని ఎంతగానో ఆశ పడిన నిందితులు ఉసూరుమన్నారు. ఇప్పటికే ఐదుగురు నిందితులు బెయిలు వచ్చినందున తమకు కూడా కచ్చితంగా బెయిలు వస్తుందని నిందితులు ఎదురుచూశారు. కానీ, న్యాయస్థానం వారి పిటిషన్లను తిరస్కరించడంతో మరికొన్నాళ్లు జైలు జీవితం అనుభవించక తప్పదని అంటున్నారు.లిక్కర్ కేసులో మొత్తం 12 మంది నిందితులను సిట్ అరెస్టు చేసింది. వీరిలో వైసీపీ ఎంపీ, ఏ4 పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితోపాటు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, మాజీ సీఎం జగన్ ఓఎస్డీగా పనిచేసిన కృష్ణమోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పతోపాటు మరో నిందితుడికి ఇప్పటికే రెగ్యులర్ బెయిలు మంజూరైంది. ఇంకా ఏడుగురు నిందితులు విజయవాడ, గుంటూరు జైళ్లలో రిమాండులోనే ఉన్నారు. అయితే ఐదుగురు నిందితులకు బెయిలు రావడంతో వీరు కూడా తమకు త్వరలో బెయిలు వస్తుందని ఆశించారు. అంతేకాకుండా తమకు ములాఖత్ లో కలిసిన వారితో కూడా ఇదే విషయాన్ని చెబుతూ వస్తున్నారు.అయితే, ఊహించని విధంగా ఏడుగురు నిందితులకు బెయిలు నిరాకరిస్తూ ఏసీబీ కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నిందితులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, చాణక్య, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ, వెంకటేశ్ నాయుడు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. వీరంతా ఈ వారం బెయిలు వస్తుందనే ఆలోచనతో ఉన్నట్లు వారి సన్నిహితులు చెప్పారు. శుక్రవారం సాయంత్రం బెయిలు పిటిషన్లను కోర్టు కొట్టివేసిందని తెలుసుకుని నిరాశ చెందారు.ఏసీబీ కోర్టు బెయిలు పిటిషన్లను తిరస్కరించడంతో నిందితులు హైకోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెలుగులోకి తీసుకువచ్చిన లిక్కర్ స్కాంపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. కొద్దిరోజుల వరకు అరెస్టులతో హడలెత్తించిన సిట్ పోలీసులు ప్రస్తుతం నిందితులకు వ్యతిరేకంగా సాక్ష్యాధారాలను సేకరించే పనిలో బిజీగా ఉన్నారు. ఇదే సమయంలో బిగ్ బాస్ పై ఆధారాలు లభించకపోవడంతో దర్యాప్తు నెమ్మదించిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిందితులకు బెయిలు వచ్చేస్తుందని న్యాయవాద వర్గాలు ఊహించాయి. కానీ, సిట్ వాదనలు బలంగా ఉండటంతో నిందితుల రిమాండ్ పొడిగించడానికే కోర్టు మొగ్గుచూపింది. ఈ పరిస్థితుల్లో తదుపరి దర్యాప్తు, సిట్ యాక్షన్ ఎలా ఉంటుందనేది ఉత్కంఠ రేపుతోంది.

## నార్సింగిలో హిట్ అండ్ రన్ కేసు

హైదరాబాద్,హైదరాబాద్ నార్సింగి పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హైదర్ షాకోట్ చౌరస్తా దగ్గర జరిగిన ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే, హైదర్ షాకోట్ ప్రాంతానికి చెందిన కృష్ణ అనే వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ సందర్భంగా కృష్ణ కారు చక్రాల కింద నలిగి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే కారు ఆపకుండా డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఇక, స్థానికులు ఆ కారును ఆపేందుకు ప్రయత్నించినా, మితిమీరిన వేగంతో డ్రైవర్ తప్పించుకున్నాడు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది.

# కొండా సురేఖ వివాదంలో మరో మంత్రి ఇరుక్కుపోయారా..?

హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వంలో ఒక్క కుదుపు కుదిపిన మంత్రి కొండా సురేఖ ఓఎస్డి సుమంత్ రచ్చ ముగిసింది. కొండా సురేఖ దంపతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. అక్కడితో ఆ ఎపిసోడ్ ముగిసిపోయినా.. తెరవెనక అసలు ఏం జరిగింది ? అన్నదానిపై అసలు నివేదిక ప్రభుత్వం దగ్గర ఉండిపోయిందంటున్నారు. ఇందులో పలు కీలక విషయాలు ఉన్నాయని టాక్ ? కొండా సురేఖ ఎపిసోడ్లో అసలు నిజం ఏమిటి .. దీనికి బాధ్యులు ఎవరు ?బదనామయ్యింది ఎవరు?సురేఖ తన ఓఎస్డి సుమంత్ ని కారులో ఎక్కించుకుని ఎక్కడికి తీసుకువెళ్లారు ?అన్నదానిపై ఇంటిలిజెన్స్ పూర్తి నివేదిక ప్రభుత్వం వద్ద ఉన్నట్టు తెలుస్తుంది. అయితే ఆ రిపోర్ట్ లో విషయాలు చూసి ప్రభుత్వ పెద్దలు షాక్ అవుతున్నారట.ఈ ఎపిసోడ్లో మరో బీసీ మంత్రికి కూడా మరక అట్టినట్టు అయిందని అంటున్నారు.సాధారణంగా ఇలాంటి వివాదాలకు ఆ మంత్రి దూరంగా ఉంటారు. అయితే అనూహ్యంగా ఈ విషయంలో ఎందుకు ? వెలుపెట్టారు అన్న ప్రశ్న ఇప్పుడు తెరమీదకు వచ్చింది. ఓఎస్డి సుమంత్ కోసం కొండా సురేఖ ఇంటి దగ్గరికి పోలీసులు వచ్చిన రోజు రాత్రి అతడిని తన కారులో ఎక్కించుకొని నేరుగా మినిస్టర్స్ క్వార్టర్స్ కి వెళ్లారట. సురేఖ అక్కడ కూడా తనకు కేటాయించిన భవనంలో కాకుండా.. మరో బీసీ మంత్రి ఇంటికి సుమంత్ ని తీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ మంత్రి ఇంట్లోనే సుమంత్‌ను ఆ రాత్రికి ఉంచినట్టు ఇంటెలిజెన్స్ వర్గాల ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాయట. ఆ మంత్రి ఇలాంటి వాటికి దూరంగా ఉంటారు.. వివాదాల జోలికి పెద్దగా వెళ్లరు. అయితే ఇందులో ఎలా ఇరుక్కున్నారు ? అని ఆరా తీస్తే మరో షాకింగ్ మ్యాటర్ వెలుగు చూసిందట.కొండా ఓఎస్డి సుమంత్ ను ఈ రాత్రికి మీ దగ్గరే ఉండనివ్వాలని తెలంగాణలో కాంగ్రెస్‌లో అత్యంత కీలకమైన పదవి నిర్వహిస్తున్న ఓ సీనియర్ లీడర్ సూచించినట్టు తెలుస్తోంది. ఆ కీలక వ్యక్తి ఫోన్ చేయడంతో వివాదరహితుడు అయిన ఆ బీసీ మంత్రి సుమంత్ కు ఆ రోజు రాత్రి తన ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చినట్టు ఇంటెలిజెంట్ రిపోర్టులో క్లియర్‌గా ఉన్నట్టు సమాచారం.కొండా సురేఖ దంపతులు రేవంత్ రెడ్డిని కలిసి ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టేశారు.అయితే ఏమాత్రం సంబంధంలేని ఈ బీసీ మంత్రి అనూహ్యంగా ఈ ఎపిసోడ్లో ఇరుక్కుపోయారు. ఒక్కసారిగా ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రభుత్వ పెద్దలకు ఇచ్చిన నివేదికలో తన పేరు కూడా ఉందన్న విషయం తెలుసుకున్న ఆ మంత్రి ఇప్పుడు కక్కలేక మింగలేక ఉన్నట్టు తెలుస్తోంది.



# ఆక్రమిత కాశ్మీర్‌లో మానవహక్కుల ఉల్లంఘన

న్యూఢిల్లీ,ప్రజాస్వామ్యం అనే పదం పాకిస్థాన్ కు ఎప్పటికీ వింతేనని భారత్ దుయ్యబట్టింది. అక్కడ ఏనాడు ఇది కనిపించదన్నారు. అలాగే ఆ దేశం చట్టవిరుద్ధంగా ఆక్రమించిన ప్రాంతాల్లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలపై భారత్ ఆందోళన వ్యక్తంచేసింది. వీటిని వెంటనే ఆపాలని డిమాండ్ చేసింది. ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడారు. ఈ సందర్భంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆ దేశ సైన్యం ఆక్రమణ, అణచివేత, వనరులను చట్టవిరుద్ధంగా వినియోగించడం వంటి వాటిపై అక్కడి ప్రజలు తిరుగుబాటు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘనలను అంతం చేయాలని డిమాండ్ చేశారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో విడదీయరాని భాగంగా ఉందని, ఎప్పటికీ ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. ఆ ప్రాంత ప్రజలు భారత ప్రజాస్వామ్యానికి అనుగుణంగా వారి ప్రాథమిక హక్కులను వినియోగించు కుంటున్నారని తెలిపారు. ఇది పాక్‌కు ఎప్పటికీ మింగుడుపడని విషయమని ఎద్దేవా చేశారు. ఇక, భారత్ వసుదైవ కుటుంబకం అని అన్నారు. ప్రపంచం మొత్తాన్ని ఒకే కుటుంబంగా చూడటం, అందరికీ న్యాయం, గౌరవం కోసం తన గొంతుకను వినిపిస్తోందన్నారు. ఈ సందర్భంగా రెండో ప్రపంచయుద్ధం తర్వాత అంతర్జాతీయ శాంతి, భద్రతకు ఆశాకిరణంగా యూఎన్ స్థాపించిన విషయాన్ని గుర్తుచేశారు. వలస రాజ్యాల నిర్మూలనకు సంస్థ ఎంతో కృషి చేసిందన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com